# సాగునీటి కొరతతో ఒక్క ఎకరం పంట కూడా ఎండిపోవద్దు

### సాగునీటి జలాశయాల్లో పూడికతీతను వేగవంతం చేయండి
### రైతులకు ఉచితంగా పూడికతీత మట్టి
### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో యాసంగి పంటలు కొద్దిరోజుల్లోనే కోత దశకు రానున్నందున సాగునీటి కొరతతో ఒక్క ఎకరా పంట కూడా ఎండి పోకుండా చూడాలని ఉన్నతాధికారులను రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. చివరి దశలో ఉన్న పంటలకు తగినంత సాగునీటిని అందించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ విషయమై ఆదివారం ఆయన అత్యవసర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రధాన, మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించడంతోపాటు చెరువులు, జలాశయాల్లో పూడికతీతను వేగవంతం చేయాలని నిర్దేశించారు. పూడికతీత కోసం చెరువులు, జలాశయాలపై తక్షణ ప్రణాళికలు సిద్ధం చేయాలని, 30-40శాతం వరకు సిల్టింగ్ ఉన్న ప్రాజెక్టులను పునరుద్ధరించాలని ఆదేశించారు.
పూడికతత తీతద్వారా తీసిని మట్టిని రైతులకు ఉచితంగా అందించాలని, సహజ ఎరువుగా ఉపయోగించుకునేలా చూడాలన్నారు. యాసంగి పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవడంతోపాటు తాగునీటి అవసరాలకు తగిన నిల్వలను కొనసాగించాలని ఆదేశించారు. చీఫ్ ఇంజనీర్లు అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించేందుకు ప్రత్యక్షంగా పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. అవసరమైతే తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు.
నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలో సుమారు 6.30లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయని, ప్రస్తుతం ఎక్కువ భాగంలో కోతలు పూర్తయ్యాయని, ఇంకా సాగునీరు అవసరమైన పంటలకు తప్పనిసరిగా నీరందించాలని ఆదేశించారు. జూరాల ప్రాజెక్టులో ప్రస్తుతం 1.66 టిఎంసిల నీరు నిల్వ ఉందని, నారాయణపూర్ నుంచి మరో 0.5టిఎంసిలు వచ్చే అవకాశం ఉందని అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. ఈ నేపథ్యంలో జూరాల ప్రాజెక్టు మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, బ్రిడ్జ్ కమ్ బ్యారేజి నిర్మాణంపై తుది నిర్ణయం తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. అదేవిధంగా సెంట్రల్ వాటర్, పవర్ రిసెర్చ్ స్టేషన్ ద్వారా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారెజి పునరుద్ధరణ విషయంలో జరుగుతున్న అధ్యయనాల పురోగతిని మంత్రి ఉత్తమ్ సమీక్షించారు.
ఆయా జిల్లాల నీటిపారుదలశాఖ చీఫ్ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారి చేశారు.



## బాబుజగ్జీవన్‌రామ్‌కు సిఎం రేవంత్‌రెడ్డి నివాళి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 5:** స్వాతంత్ర్య సమరయోధుడు,మాజీ ఉప ప్రధానమంత్రి డా.బాబూ జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ఆ మహనీయుడి చిత్ర పటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అణగారిన వర్గాలు, కార్మికుల సంక్షేమం కోసం వారు చేసిన కృషిని సీఎం కొనియాడు. కుల వివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడారని, దళితుల హక్కుల కోసం వారు జీవితాంతం పనిచేశారని గుర్తు చేసుకున్నారు. బాబూజీ స్ఫూర్తితో తెలంగాణలో సామాజిక న్యాయం, అన్ని వర్గాల మేలుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి అన్నారు.

## బిసి కమిషన్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

**హైదరాబాద్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:**తెలంగాణలోని పలు ప్రభుత్వ ఆఫీసుల్లోనూ బాబూజగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. అందులో భాగంగా బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి ఉత్సవాన్ని తెలంగాణ బీసీ కమిషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బీసీ కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాల లక్ష్మి మ్‌తోపాటు అధికారులు పాల్గొన్నారు. 119వ జయంతి సందర్భంగా జగ్జీవీన్‌రామ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ జి.నిరంజన్ మాట్లాడుతూ.. బాబు జగ్జీవన్ రామ్ భారతదేశానికి, బడుగు బలహీన వర్గాలకు ఎంతో సేవ చేశారని కొనియాడారు.ఆదివారం ఆర్టీసీ బస్ భవన్‌లో మహానేత 119వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ 119వ జయంతిని పురస్కరించుకుని టీజీఎస్ఆర్టీసీ ఘనంగా నివాళులర్పించింది. సంస్థ ప్రధాన కార్యాలయం బస్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈడీ సిహెచ్. వెంకన్న, అధికారులు సిబ్బంది బాబుజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఒక సామాన్య కుటుంబంలో జన్మించిన బాబుజీ, నాటి కాలంలో ఉన్న అస్పృశ్యత, వివక్ష వంటి సామాజిక రుగ్మతలను విద్యార్థి దశ నుంచే ధైర్యంగా ఎదుర్కొని జన చైతన్యం తెచ్చిన గొప్ప సంస్కర్త అని వారు గుర్తుచేశారు.

## హైదరాబాద్‌లో కొనసాగుతున్న డ్రంకన్‌డ్రైవ్ దాడులు

### 464 మంది మందుబాబుల పట్టివేత

**హైదరాబాద్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:** జంట నగరాలలో మందు బాబుల భరతం పట్టేందుకు డ్రంకన్ డ్రైవ్ దాడులు కొనసాగుతూనే వున్నాయి. శుక్రవారం, శనివారం రాత్రుల్లో ట్రాఫిక్ పోలీసులు పలుచోట్ల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ దాడుల్లో మొత్తం 464 మంది మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 408 మంది ద్విచక్ర వాహనదారులు, 30 మంది ఆటో డ్రైవర్లు, 26 మంది కార్లతో పాటు భారీ వాహనాల డ్రైవర్లు వున్నారు. పట్టుబడ్డ వారిలో 93 మంది 30 నుంచి 50 పాయింట్ల వరకు వుండగా 194మంది 51 నుంచి 100 పాయింట్ల వరకు, 93 మంది 101 నుంచి 150 పాయింట్ల వరకు, 55 మంది 151 నుంచి 200 పాయింట్ల వరకు, 18 మంది 201 నుంచి 250 పాయింట్ల వరకు, ఏడుగురు 251 నుంచి 300 పాయింట్ల వరకు, నలుగురు 300 పాయింట్లకు మించి విపరీతంగా మద్యం సేవించినట్లు తేలింది. వీరిని అరెస్టు చేసిన తరువాత వారి వా హనాలు జప్తు చేసి, కేసులు నమోదు చేశాక సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. వీరికి కౌన్సిలింగ్ నిర్వహించిన తరువాత కోర్టుల్లో హాజరు పరు స్తారు. కోర్టులు వీరికి శిక్షలు విధిస్తాయని నగర జాయింట్ ట్రాఫిక్ పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్ మీడియాకు తెలిపారు. జంట నగరాలలో డ్ర ంకన్ డ్రైవ్ దాడులు నిరంతరం కొనసాగుతాయని, వీటిని పూర్తిస్థాయిలో అరికడతామని ఆయన వెల్లడించారు.

## ప్రభుత్వ పాఠశాలలను ముఖ్యమంత్రి విమర్శించడం తగదు

### ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ

**హైదరాబాద్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:**ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను విమర్శించడం సరైన చర్య కాదని ప్రైమరీ టీచరన్స అసోసియేషన్(పిటిఏ) తెలంగాణ రాష్ట్ర కమిటీ విమర్శించింది. సిఎంగా ఉంటూ ప్రైవేటు పాఠశాలల ఓపెనింగ్‌కి పోవడమే తప్పుకాగా.. అక్కడికి వెళ్లి తాను విద్యాశాఖమంత్రిగా కూడా కొనసాగుతూ ప్రభుత్వ స్కూల్స్‌ను విమర్శించడం సరైంది కాదని పిటిఏ టిజి రాష్ట్ర అధ్యక్షులు కె మల్లికార్జున్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ కె శారద, అదనపు జనరల్ సెక్రటరీ మేడి దేవదాస్ అన్నారు. ముఖ్యమంత్రి ప్రారంభించిన స్కూల్ యాజమాన్యం వసూలు చేసే ఫీజులు ఏడాదికి రూ. 2 లక్షల కంటే ఎక్కువగా ఉంటాయని, ఇంకా డొనేషన్స్, ట్రాన్స్ పోర్ట్, స్పెషల్ ఫీజులు, ఇతర ఫీజులు కూడా ఉంటాయన్నారు. ప్రైవేట్ స్కూల్ ఓపెనింగ్‌కు పోవడమే తప్పన్నారు. ప్రైవేట్ స్కూల్స్‌లో 3 సంవత్సరాలకే ప్రీప్రైమరీ విద్య ప్రారంభిస్తారని, అక్కడ తరగతికి ఒక్క ఉపాధ్యాయుడు ఉటారని అన్నారు. పైగా అక్కడ టీచర్లు చదువు మాత్రమే చెబుతారని.. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో ఆల్‌రౌండ్ పనులు చేయాల్సి ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి ప్రసంగం ప్రభుత్వ ఉపాధ్యాయుల ఆత్మస్థైర్యాన్ని, ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీసే విధముగా ఉందని మండిపడ్డారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఎత్తివేతకు ప్రభుత్వ కుట్ర

### ఎబివిపి రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు

**హైదరాబాద్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఎత్తివేతకు ప్రభుత్వ కుట్ర చేస్తోందని అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు విమర్శించారు. రాష్ట్రంలోనిపేద, బడుగు బలహీన వర్గాలకు విద్యాప్రదాయినిగా ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే దిశగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నట్లు అనిపిస్తోందని రాంబాబు ఆరోపించారు. ఇటీవల జరిగిన పరిణామాలు చూస్తుంటే ఈ విషయం స్పష్టం అవుతుందన్నారు. విద్యాకమిషన్ నివేదికలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అవసరం లేదన్నట్లు ప్రస్తావించగా, ప్రభుత్వం సకాలంలో కౌంటర్ దాఖలు చేయని కారణంగా విద్యార్థుల దగ్గర నుండే ఫీజులు వసూలు చేసుకోవచ్చని హైకోర్టు వ్యాఖ్యానించడం విద్యార్థి సమాజంలో ఆందోళన కలిగిస్తోందన్నారు. ఒక వైపు బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థులను వేధింపులకు గురిచేస్తున్న రాష్ట్ర సర్కార్ మరోవైపు ఏ విధంగా ఈ పథకాన్ని ఎత్తివేయలా అని ప్రణాళిక బద్దంగా పనిచేస్తుందన్నారు. లక్షల మంది విద్యార్థులు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాక సర్టిఫికెట్స్ తీసుకోలేని పరిస్థితుల్లో ఉన్నారని, తద్వారా డ్రాపౌట్స్ అవుతున్నారని, బకాయిలు విడుదల చేయాలని ఉద్యమించే విద్యార్థులపై, విద్యార్థి సంఘాల నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని రాంబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రవేశపెట్టిందని, దాన్ని బీఆర్ఎస్ నిర్వీర్యం చేయాలని చూస్తోందని ఆరోపించిన రేవంత్ రెడ్డి ఇప్పుడు నోరుమెదపడం లేదన్నారు.

# ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

### నివాళులు అర్పించిన ప్రముఖులు



బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్ (సైఫాబాద్), ఏప్రిల్ 5, ప్రభాతవార్త:** ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, మాజీ ఉప ప్రధాని డా.బాబూ జగ్జీవన్‌రామ్ 119వ జయంతి వేడుకలు ఆదివారం బషీర్‌బాగ్‌లోని ఆయన విగ్రహం ఎదుట ఘనంగా జరిగాయి. వందలాది మంది రాజకీయ నాయకులు, వేలాది మంది కార్యకర్తలు, దళితులు పెద్ద ఎత్తున పాల్గొని ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు. అంతకుముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన నివాసంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కాగా, బషీర్‌బాగ్‌లోన జగ్జీవన్‌రాం విగ్రహానికి నివాళులు అర్పించిన వారిలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, హర్యానా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర మంత్రులు అండ్లూరి లక్ష్మణ్‌కుమార్, దామోదర రాజనర్సింహ్మా, జి.వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి, ఎమ్మెల్యేలు వినోద్, నాగరాజు, సామ్మేల్, మాజీ ఎంపి వి.హనుమంతరావు, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య తదితర అధికారులు, అనదికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**100 కోట్లతో అంబేద్కర్ టవర్ ఏర్పాటు: మంత్రి లక్ష్మణ్‌కుమార్**

జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఏర్పాటైన సభకు అధ్యక్షత వహించిన రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, దివ్యాంగుల, ట్రాన్స్ జెండర్ సంక్షేమ శాఖ మంత్రి అండ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ దళితుల హక్కుల కోసం, సమానత్వ సాధన కోసం తన జీవితమంతా కృషి చేసిన మహానుభావుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం దళితుల అభ్యున్నతి కోసం ఎంతో కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి సూచించిన ప్రకారం ట్యాంక్‌బండ్ ప్రాంతంలో 100 కోట్ల రూపాయలతో అంబేద్కర్ టవర్ ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే కాచిగూడ, నింబోలిఅడ్డలోని దళిత విద్యార్థుల కోసం 25 కోట్లతో ఒక హాస్టల్‌ను నిర్మిస్తామన్నారు.
రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వి.వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ దళితుల హక్కుల కోసం బాబూ జగ్జీవన్‌రామ్ నిరంతరం పోరాడారని, ఆయన జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ చదవాలన్నారు. కేంద్రంలో అనేక పదవులు చేపట్టి దళితుల అభ్యున్నతికి ఎనలేని సేవలు అందించారని, దళితులు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారని గుర్తు చేశారు. పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి ప్రసంగిస్తూ జగ్జీవన్‌రామ్ దళితుల హక్కుల పరిరక్షకుడని, సామాజిక సమానత్వ శిల్పి అని కొనియాడారు. దళితుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రాధాన్యత ఇస్తున్నదని, సంక్షేమ పథకాలను అందిపుచ్చుకోవాలన్నారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ కేంద్రంలో అనేక మంత్రి పదవులు చేపట్టిన బాబూ జగ్జీవన్‌రామ్ దళితుల పరిరక్షకుడిగా, దళితుల అభ్యున్నతి కోసం విశేషమైన సేవలు అందించారని కొనియాడారు.
మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ కేంద్రంలో అనేక పదవులు చేపట్టిన జగ్జీవన్‌రామ్ పదవులకు వన్నె తీసుకువచ్చి అర్ధశతాబ్దానికిపైగా సేవలు అందించారని, ఆయనకు భారత రత్న అవార్డును ప్రకటించాలని కోరారు. ఈ సభలో మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, మాజీ ఎంపి వి.హనుమంతరావు, దళిత నాయకులు జె.బి.రాజు, జి.చెన్నయ్య, ఏపూరి సోమన్న, జయంతి ఉత్సవాల కమిటి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నీటిపారుదల శాఖ పునర్వ్యవస్థీకరణకు రంగం సిద్ధం

### ప్రత్యేకంగా మైనర్ ఇరిగేషన్ విభాగం ఏర్పాటు
### చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంల సమర్థ నిర్వహణకు ఆ విభాగాన్ని పునరుద్ధరించాలని సిఫారసు

**హైదరాబాద్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:** కీలకమైన నీటిపారుదలశాఖ పునర్ వ్యవస్థీకరణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైనట్లు సమాచారం. ప్రత్యేకంగా మైనర్ ఇరిగేషన్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలకు రూపకల్పన చేసినట్టు తెలిసింది. దీంతో నీటిపారుదలశాఖ మేజర్ (పెద్దతరహా నీటిపారుదల విభాగం), మైనర్ (చిన్నతరహా నీటిపారుదల విభాగం)గా మళ్లీ వేరుకానుంది. ఈ ప్రక్రియకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడే త్వరలో అవకాశమున్నట్లు తెలుస్తోంది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం నీటిపారుదలశాఖను పునర్వ్యవస్థీకరించింది. మేజర్, మీడియం, మైనర్ ఇరిగేషన్ విభాగాలను తొలగించి టెరి టోరియల్ ప్రతిపాదికగా చీఫ్ ఇంజినీర్లను నియమించింది.
అదేసమయంలో కీలకమైన ఆపరేషన్స్ అండ్ మెయింటనెన్స్ (ఒఅండ్ఎం) విభాగాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. అయితే ఇటీవల కర్ణాటకతో పాటు ఇతర రాష్ట్రాల్లో పర్యటించిన తెలంగాణ బృందం... చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు తదితర నీటి వనరులను పటిష్టంగా, ప్రణాళికాబద్ధంగా నిర్వహించేందుకు, ఈ నీటివనరుల భూములు అన్యాక్రాంతం, కబ్జాకు గురికాకుండా ఉండాలంటే, సత్వర మరమ్మతు పనులను చేపట్టాలంటే చిన్ననీటి వనరుల నిర్వహణ (మైనర్ ఇరిగేషన్) విభాగాన్ని ప్రత్యేకంగా కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది.
ఈ నేపథ్యంలో సాగునీటిపారుదలశాఖ పరిధిలో ఉన్న మైనర్ ఇరిగేషన్ విభాగాన్ని వేరుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో సాగునీటి శాఖ అత్యంత కీలకమైంది. అదే సమయంలో ప్రస్తుతం ఇరిగేషన్‌శాఖలో ఉన్న ఇఎన్‌సి పోస్టులను కూడా పునర్వ్యవస్థీకరించేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు సమాచారం. ప్రస్తుతం నీటిపారుదలశాఖలో మొత్తం ఆరు ఈఎన్సి పోస్టులు ఉన్నాయి. అందులో మూడు జనరల్, అడ్మిన్, ఓఅండ్ఎం, కాగా మిగతా 3 టెరిటోరియల్ స్థాయిలో ఉన్నాయి. ఓఅండ్ఎం, టెరిటోరియల్ ఈఎన్సీ పోస్టులను రద్దు చేసి, వాటి స్థానంలో కమిషనర్ ఆఫ్ టెండర్స్(సిఓటి)కి, ఇంటర్ స్టేట్, డ్యామ్‌సేఫ్టీ, హైడ్రాలజీ విభాగాలకు కలిపి ఒక ఈఎన్సి, సెక్రటేరియట్‌లోని అడిషనల్ సెక్రటరీకి పోస్టుకు ఈఎన్సిని, అదేవిధంగా వాలంతరీ డైరెక్టర్ జనరల్(డిజి) పోస్టును ఈఎన్సిగా అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు నీటిపారుదలశాఖ పునర్వ్యవస్థీకరిస్తూ త్వరలోనే ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించే అవకాశముందని ఇరిగేషన్‌వర్గాలు చెబుతున్నాయి.

# గనుల ఆదాయం రాష్ట్రాలకే

### దేశవ్యాప్తంగా 1,374 గనులు మూత
### ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ వెల్లడి

**హైదరాబాద్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా ఉన్న గనుల ఆదాయం సంబంధిత రాష్ట్రాలకే చెందుతుందని కేంద్రం స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా ఖనిజాల తవ్వకానికి అనుమతులు మంజూరు చేయడం, వాటి ద్వారా వచ్చే ఆదాయాలను వసూలు చేయడం అనే అంశాలు రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోకి వస్తాయని ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ తెలిపింది.
బ్యూరో ఆఫ్ మైన్స్ విడుదల చేసిన నివేదిక ప్రకారం గత ఐదు సంవత్సరాల కాలంలో దేశవ్యాప్తంగా సమకూరిన ఆదాయ వివరాలను చూస్తే ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ప్రభుత్వం ఆధీనంలో 234 గనులు కంపెనీలు ఉండగా, ప్రైవేటు వ్యక్తుల చేతిలో 2,408 ఉన్నాయి. ప్రభుత్వం ఆధీనంలో ఎక్కువగా ఒడిశాలో 48, మధ్యప్రదేశ్లో 29, కర్నాటకలో 27 ఉన్నాయని నివేదిక తెలిపింది. ఇక ప్రైవేటు వ్యాపారుల వద్ద ఎక్కువగా మధ్యప్రదేశ్‌లో 431, తమిళనాడు 400, గుజరాత్లో 306 కంపెనీలు ఉన్నాయని పేర్కొంది. కాగా దేశ వ్యాప్తంగా పలు గనులు దశల వారీగా మూతపడుతున్నాయి.
ప్రస్తుతం గనులు పనిచేయక పోవడానికి ప్రధాన కారణాలు ఉన్నాయని వెల్లడించింది. ప్రధానంగా వాటికి చట్టపరమైన అనుమతులు లభించకపోవడంతో పాటు, వాటి నిబంధనలను పాటించలేదు. అంతేకాకుండా తగిన నాణ్యత గల ఖనిజం లభించకపోవడం, ఆర్థికంగా లాభదాయకం కాని కార్యకలాపాలు, కోర్టు కేసులు, వివాదాలు నడుస్తున్నాయి. గనుల బ్లాకులు పర్యావరణ సున్నిత ప్రాంతాలు కానీ నోటిపై చేయబడిన వన్యప్రాణి, పులుల కారిడార్ల పరిధిలోకి రావడం, భూసేకరణ, స్థానిక సమస్యలు వంటి ఇతర అంశాలతో దేశంలోని పలు గనులు మూత పడ్డాయి. దేశవ్యాప్తంగా మినరల్స్ 2,642 గనులు ఉండగా, అందులో 1,268 పనిచేస్తుండగా, మరో 1,374 మూతపడినట్లు బ్యూరో ఆఫ్ మైన్స్ పేర్కొంది.

# కేంద్ర సాయుధ పోలీస్ దళాల సమస్యలను పరిష్కరించాలి

### లేదంటే దేశభద్రతపై ప్రతికూల ప్రభావం




సమావేశంలో మాట్లాడుతున్న వి.పురుషోత్తమరావు

**హైదరాబాద్ (సైఫాబాద్), ఏప్రిల్ 5, ప్రభాతవార్త:** కేంద్ర సాయుధ పోలీస్ దళాల (సిఎపిఎఫ్ఎస్), సిఆర్‌పిఎఫ్, సిఐఎస్ఎఫ్, బిఎస్ఎఫ్, ఐటిబిపి, ఎస్ఎస్‌బిలకు చెందిన మాజీ సిఎపిఎఫ్ అధికారులు, సిబ్బంది ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను కే ంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని తెలంగాణ మాజీ సిఎపిఎఫ్ పర్సనల్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. సమస్యలు పరిష్కారించకపోతే సిఎపిఎఫ్ సిబ్బంది మనోబలం మాత్రమే కాకుండా దేశ భద్రతపై కూడా ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని అసోసియేషన్ ప్రతినిధులు హెచ్చరించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిఆర్‌పిఎఫ్ రిటైర్డ్ డిజి వి.పురుషోత్తమరావు, సిఐఎస్ ఎఫ్ రిటైర్డ్ డిజి డి.శ్యామల, అసోసియేషన్ అధ్యక్షుడు కె.శ్యామ్‌సుందర్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ 13 సంవత్సరాల సుదీర్ఘంగా న్యాయ పోరాటం చేసి విజయం సాధించిన సుప్రీంకోర్టు తీర్పులను కేంద్ర ప్రభుత్వం అమలు చేయకుండా పార్లమెంటలో దొడ్డిదారిన ఒక బిల్లును ప్రవేశపెట్టి కోర్టు ఆదేశాలను లెక్క చేయక పోవడం రాజ్యాంగ పరిహాసమేనని, కేడర్ నిర్వహణ, ఇతర సేవలతో సమానత్వ ంపై సుప్రీం కోర్టు ఇచ్చిన అనేక తీరు ్పలు అమలు చేయక పోవడం అన్యాయమన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పదోన్నతుల్లో స్థబ్దత, వృత్తి అసమానతలను తొలగించాలని కోరారు. సిఎపిఎఫ్ (జనరల్ అడ్మినిస్ట్రేషన్) బిల్లు 2026కు సంబంధించి దళాలతో ఏలాంటి సంప్రదింపులు లేకుండా పార్లమెంట్ ఉభయ సభలు అమోదం పొందడం అధికార వికేంద్రీకరణ, కేడర్ అధికారుల హక్కుల హననం, భాగస్వామ్యులతో సరైన సంప్రదింపుల లోపం తీవ్రమైన ఆందోళనలు కలిగిస్తున్నదని, ఇవి దళాల స్వయం ప్రతిపత్తి, పనితీరును మరింతగా బలహీనపరచ వచ్చునన్నారు. కర్తవ్య నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన సిబ్బందికి 'శహీద్' హోదా ఇవ్వకుండా ఆపరేషనల్ క్యాజువాల్టీగా వర్గీకరించడం దారుణమనా ్నరు. వారి అత్యున్నత త్యాగానికి సరైన విధంగా గౌరవించాలన్నారు. మాజీ పారా మిలటరీ అధికారుల దీర్ఘకాలిక సమస్యలన పరిష్కారించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## బిజెపి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

### రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు

**హైదరాబాద్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ కార్యకర్తలు ఘనంగా జరుపుకోనున్నారని రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి బూత్‌లో, ప్రతి ప్రాంతంలో పార్టీ కార్యకర్తలు ఇప్పటికే భారతీయ జనతా పార్టీ జెండాను ఆవిష్కరించడం ప్రారంభించి, పార్టీ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని అన్నారు. (ఏప్రిల్ 6,1980లో బిజెపి ఆవిర్భవించింది) ఈ సందర్భంగా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి, ప్రజలు కూడా తమ ఇళ్లపై భారతీయ జనతా పార్టీ జెండాను ఎగురవేయాలని కోరారు. దీంతో జాతీయ గౌరవ భావన, ప్రజా భాగస్వామ్యం, పార్టీ పట్ల ప్రజల ఆత్మీయ అనుబంధం మరింత బలపడుతుందన్నారు. భారతీయ జనతా పార్టీ కేవలం ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాదు, జాతీయ సేవ, జాతీయత, క్రమశిక్షణ, ప్రజల పట్ల నిబద్ధత అనే విలువలతో ముందుకు సాగే ఒక మహత్తర జాతీయ ఉద్యమం అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి కార్యకర్త దేశం ముందు – పార్టీ తరువాత – స్వయం చివర అనే భావంతో, పార్టీ సిద్ధాంతాలను మరింతగా ప్రజలకు చేరువ చేసే సంకల్పంతో ముందుకు సాగుతున్నారని అన్నారు. నలభై ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకుని 46 సంవత్సరంలోకి అడుగుపెడుతున్న భారతీయ జనతా పార్టీ, ఈరోజు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా నిలవడం మనందరికీ గర్వకారణం అన్నారు. భారతీయ జనతా పార్టీ దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన విషయం స్పష్టంగా కనిపిస్తుందని, రాబోయే కాలంలో కూడా భారతీయ జనతా పార్టీయే మళ్లీ అధికారంలోకి వస్తుందని ప్రజలు నిర్ణయించుకున్నట్టుగా స్పష్టంగా తెలుస్తుందన్నారు.

## సింగరేణిలో రూ.1,400 కోట్ల ఆర్థిక అవకతవకలు : కాగ్

**హైదరాబాద్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:** సింగరేణి కాలరీస్‌లో గత ఏడాది దాదాపు రూ.1,400 కోట్ల ఆర్థిక అవకతవకలు జరిగాయని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనర్ (కాగ్) వెల్లడించింది. ఈ మేరకు నివేదికలో వీటి వివరాలను వెల్లడించింది. 2024-25లో సింగరేణి డిస్కంలపై క్లెయిమ్ చేసిన రూ.2,234.35 కోట్ల లేట్ పెనాల్టీ సర్‌చార్జ్ (ఎల్‌పీఎస్)ను ఆడిట్‌లో వెల్లడించలేదని తప్పుపట్టింది. ల్యాండ్ అక్వేషన్, పర్యావరణ నిబంధనలు పాటించడం తదితర అనేక అంశాల్లో అధికారుల అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని పేర్కొంది. సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలు రోజురోజుకు పేరుకుపోతున్నాయని తెలిపింది. మరోపక్క డీజిల్ నిర్వహణ నుంచి పెద్ద కాంట్రాక్టుల వరకు అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని పేర్కొంది. దీనికి డీజిల్ వినియోగంలో లోపాలు, రవాణా సమస్యలు, కాంట్రాక్టర్ల ఒప్పంద ఉల్లంఘనలు కారణమని పేర్కొంది. ఒక్క ఏడాదిలోనే రూ.251 కోట్ల డీజిల్ పక్కదారి పట్టిందని స్పష్టం చేసింది.

## దిగివచ్చిన చికెన్ ధరలు

### కిలో ధర రూ.250 నుండి 300 లోపే

**హైదరాబాద్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:**:రాష్ట్ర వ్యాప్తంగా చికెన్ ధరలు తగ్గుముఖం పట్టాయి. దాదాపు రెండు నెలలుగా రూ.350 నుంచి రూ400దాకా ధర పలికి కేజి చికెన్ ధర దిగివచ్చింది. ఈ ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా కిలో చికెన్ రూ.250 నుండి రూ. 300 మధ్యన విక్రయాలు జరిగాయి. సాధారణంగా ప్రతి ఆదివారం మధ్య తరగతి కుటుంబాల ప్రజలు ఇంటిల్లిపాది ఒకచోట కూర్చొని చికెన్ వంటకాలతో భోజనం చేస్తుంటారు.దీంతో ఆదివారం చికెన్ షాపులు వద్ద పెద్దపెద్ద క్యూలు కనిపిస్తుంటాయి. ప్రస్తుతం నాలుగైదు రోజులుగా చికెన్ ధరలు తగ్గుముఖం పట్టడంతో సామాన్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వరంగల్‌లో రూ.280, కామారెడ్డి జిల్లాలో రూ.280 నుంచి రూ.290 వరకు విక్రయిస్తున్నారు. హైదరాబాద్‌లో ప్రాంతాలను బట్టి చికెన్ ధరలు ఉన్నాయి. ఫాంరేటు రూ.140కాగా రిటైల్ ధర రూ.167గా ఉంది. కిలో డ్రెస్డ్ చికెన్ రూ.242 కాగా స్కిన్ లెస్ ధర రూ. 270గా ఉంది. ఇలా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కిలో చికెన్ ధరలు రూ. 250 నుంచి రూ. 300 వరకు ఉన్నాయి.



బిసి సంఘాల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి ఆర్.కృష్ణయ్య, చిత్రంలో డాక్టర్ ర్యాగ అరుణ్‌కుమార్, నీల వెంకటేష్ తదితరులు

## ఫీజుల వసూలు తీర్పుపై ప్రభుత్వం అప్పీలు చేయాలి: ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, ఏప్రిల్ 5 ప్రభాతవార్త:** విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయాలని హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ప్రభుత్వం అప్పీలు చేయాలని జాతీయ రాజ్యసభ సభ్యుడు,బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్ అధ్యక్షతన 18 బీసీ సంఘాల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థుల ఫీజులపై అప్పీలు చేయని పక్షంలో రాష్ట్రంలో ప్రభుత్వ పాలనను స్తంభింప చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయాలని హైకోర్టు తీర్పు ఇవ్వడం అన్యాయమని అన్నారు. పేద విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయొద్దని ప్రభుత్వ పాలసీ, సుప్రీంకోర్టు తీర్పు ఉందని ఆయన పేర్కొన్నారు. అయినా ప్రభుత్వం ఫీజుల కేసు విషయమై సరైన వాదనాలు వినిపించలేదని, అడ్వొకేట్ జనరల్ అసమర్థత వల్లే హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. కోర్టు మీద నెట్టివేసి ప్రభుత్వం ఫీజు రియంబర్స్‌మెంట్ పథకం ఎత్తివేసే కుట్రలో భాగమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల ఫీజు బకాయిలు రూ.8వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.సమావేశంలో బిసి సంఘాల ప్రతినిధులు నీల వెంటకేష్, టి.రాజేష్ యాదవ్, జిల్లపల్లి అంజి, సి.రాజేందర్, పగిళ్ల సతీష్, నిఖిల్‌పటేల్, శివకుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి హెల్త్ వీక్, ఫుడ్ సేఫ్టీపై ప్రత్యేక కార్యక్రమాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 5:** తెలంగాణ ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ మేరకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం నుంచి హెల్త్ వీక్ కార్యక్రమం చేపట్టనుంది. తొలి రోజు ఫుడ్ సేఫ్టీపై ప్రత్యేక ఈవెంట్లను నిర్వహించనున్నారు. సోమవారం నాడు నెక్లెస్ రోడ్డులో సుమారు వెయ్యి మందితో ఆహార భద్రతపై అవేర్‌నెస్ వాక్ చేయనున్నారు. ఉదయం 6:30 గంటలకు జల విహార్ వద్ద వాకథాన్‌ను తెలంగాణ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించనున్నారు. హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వరకూ వాకథాన్ సాగనుంది. ఈ వాకథాన్‌లో మంత్రితోపాటు పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, విద్యార్థులు, ఎన్‌జీవోల ప్రతినిధులు పాల్గొనున్నారు. ఉదయం 10 గంటల నుంచి నేచురోపతి హాస్పిటల్‌లో ఈట్ రైట్ మేళా నిర్వహిస్తారు. నాణ్యమైన ఆహార పదార్థాలతో 40 ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారు. ప్రత్యేక ఆకర్షణగా మిల్లెట్లతో చేసిన ఆహార పదార్థాలు నిలువనున్నాయి. ఫుడ్ సేఫ్టీ, పోషకాహారంపై అంగన్‌వాడీలకు ట్రైనింగ్ కార్యక్రమాన్నీ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే సభలో మంత్రి పాల్గొననున్నారు. ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు, హోటళ్లకు హైజీన్ రేటింగ్ సర్టిఫికెట్లను సైతం మంత్రి రాజనర్సింహ అందజేయనున్నారు.

# ఒలింపిక్స్ క్రీడలు హైదరాబాద్‌లో నిర్వహించే స్థాయిలో సదుపాయాలు

### గచ్చిబౌలి స్టేడియం అభివృద్ధిపై

### స్పోర్ట్స్‌హబ్ బోర్డ్‌తో సిఎం రేవంత్‌రెడ్డి సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 5:** ప్రపంచంలో అత్యుత్తమ క్రీడా వేదికగా గచ్చిబౌలి స్టేడియాన్ని తీర్చి దిద్దిందడమే నా లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. క్రీడల్లో దేశానికి రోల్ మోడల్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలని చెప్పారు. గచ్చిబౌలి స్టేడియం అభివృద్ధిపై చర్చించేందుకు ఆదివారం రాత్రి గచ్చిబౌలి సమీపంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో స్పోర్ట్స్ హబ్ బోర్డు సభ్యులతో సిఎం రేవంత్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బోర్డు మెంబర్స్ కొణిదెల ఉపాసన, కావ్యమారన్ సంజీవ్ గోయెంకా,సి.శశిధర్,జయేష్ రంజన్, స్పోర్ట్స్ ఎండి సోనీ బాలా దేవి హాజరయ్యారు. జూన్ 2న గచ్చిబౌలి స్టేడియం డెవలప్మెంట్ కార్యక్రమానికి శంకుస్థాపన చేస్తామని సిఎం పేర్కొన్నారు. ఆ లోగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, గచ్చిబౌలి స్టేడియంలో హెలిప్యాడ్‌తో సహా అన్ని ప్రపంచ స్థాయి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని చెప్పారు.శంశాబాద్ ఎయిర్‌పోర్డు నుంచి క్రీడా కారులు నేరుగా హెలికాప్టర్‌లో స్టేడియం చేరుకునేలా ఏర్పాట్లు ఉండాలని చెప్పారు. గచ్చిబౌలి స్టేడియానికి భవిష్యత్‌లో ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ప్రణాళిక సిద్ధం చేస్తామని చెప్పారు. ఇప్పటికే ఆర్కిటెక్చర్ ను నియమించాం..స్టేడియం అభివృద్ధి పైన బోర్డుకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామనతి పేర్కొన్నారు. దీర్ఘ కాలం లో తెలంగాణలో క్రీడల అభివృద్ధినే మా లక్ష్యమన్నారు. ఒలంపిక్స్ క్రీడలు కూడా హైదరాబాద్‌లో నిర్వహించే స్థాయిలో సదుపాయాలు ఉండాలని చెప్పారు. చైనాలో క్రీడా సౌకర్యాలను మించిన సదుపాయాలు కల్పించాలని చెప్పారు. లక్షల సంఖ్యలో ఉన్న ఐటీ,ఇతర ఉద్యోగులను ఆకట్టు కావడానికి బిగ్ స్క్రీన్స్ లాంటివి గచ్చిబౌలి స్టేడియం వద్ద ఏర్పాటు చేయాలని చెప్పారు.

# సంక్షేమంలో ఔట్‌సోర్సింగ్ రద్దు

### ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలో

### 14,250 మంది తొలగింపు

**హైదరాబాద్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సంక్షేమ శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తొలగింపునకు గురవుతున్నారు. ముఖ్యంగా మైనార్టీ, సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖలకు చెందిన గురుకులాల్లో పనిచేస్తున్న సిబ్బంది ఉద్యోగాలకు గండం వాటిల్లింది. సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకులాల సొసైటీల పరిధిలో సుమారు 12 వేల మంది ఉద్యోగులు ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్నారు. అయితే వీరందరి సేవలను ఈ నెల 23వ తేదీతో నిలిపివేస్తూ ఆయా సంక్షేమ శాఖల అధికారులు నిర్ణయం తీసుకున్నారు. తదుపరి సర్వీసునకు సంబంధించి కూడా ఎటువంటి స్పష్టత ఇవ్వకపోవడంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇక మైనార్టీ గురుకులాల సొసైటీ పరిధిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఆ సంస్థ అధికారులు షాక్ ఇచ్చే నిర్ణయం తీసుకున్నారు. గురుకులాల్లో పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఈ నెల 23వ తేదీన చివరి పనిదినంగా ప్రకటించిన అధికారులు తదుపరి విధులకు హాజరు కావద్దని ఆదేశాలు జారీ చేశారు. దీంతో మైనార్టీ గురుకులాల్లో పనిచేస్తున్న దాదాపు 2,250 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తమ ఉద్యోగాలను వదులుకోవాల్సిన పరిస్థితి తప్పడం లేదు.

# ఈస్టర్ పర్వదినం సందర్భంగా క్రైస్తవులకు సిఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 5:** ఏసుక్రీస్తు పునరుత్థానం మానవాళికి రక్షణ, నూతన జీవనానికి ప్రతీకగా నిలిచే ఈస్టర్ పర్వదినం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రైస్తవ సోదర సోదరీమణులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పవిత్ర దినం అందరి జీవితాల్లో శాంతి, ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. సత్యం, కరుణ, నమ్మకం, ఐక్యత వంటి మహోన్నత విలువలను ఆచరించేలా ఈస్టర్ పండుగ స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు.

# పథకం ప్రకారం విద్యుత్ సరఫరా సంఘంపై కుట్ర

### ఎన్పీడిసిఎల్‌లో విలీనానికి ఒప్పకోం

### స్పష్టం చేసిన చైర్మన్ రామారావు

**హైదరాబాద్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఏకైక సహకార విద్యుత్తు సరఫరా సంఘం సిరిసిల్ల నష్టాల్లో ఉందని, అవినీతి అంటూ దుష్ప్రచారం చేస్తూ పథకం ప్రకారం విలీనానికి కుట్రకు తెరలేపారని ఆ సంఘం చైర్మన్ చిక్కాల రామారావు ఆరోపించారు. ప్రతిష్టాత్మక విద్యుత్ సరఫరా సంఘాన్ని ఎట్టిపరిస్థితుల్లోనైనా కాపాడుకుంటామని స్పష్టం చేశారు. అవసరమైతే ప్రాణాలు ఫణంగా పెట్టి అయినా సంస్థను నిలపుకొంటామన్నారు. విద్యుత్ సరఫరా సంఘం 52వ మహాజన సభలో ఆయన మాట్లాడుతూ తమ సంఘం ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్)లో విలీనానికి ఒప్పుకోబోమని తేల్చిచెప్పారు. విద్యుత్ సరఫరా సంఘం 56 ఏండ్లుగా వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తూ మన్ననలు పొందిందన్నారు.

జాతీయ స్థాయి అవార్డులు సైతం దక్కించుకున్నదని చెప్పారు. సంఘం లైసెన్స్ కోసం గత డిసెంబరు నెలలోనే ప్రభుత్వానికి పంపించామని వివరించారు. అయితే గత నెల మార్చి 31 గడువు ముగియగానే అర్ధరాత్రి దాటిన తర్వాత ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థకు చెందిన అధికారులు సెస్ కార్యాలయంలో అక్రమంగా చొరబడ్డారని ఆరోపించారు. పోలీస్ బలగం పెట్టుకొని మీటింగ్‌లు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు లైసెన్స్ రెన్యువల్ ఎందుకు పెండింగ్ పెట్టిందో చెప్పలేదని ఆయన తప్పుపట్టారు. తమకు నోటీసులు ఇవ్వకుండానే సెస్‌లో చొరబడ్డారని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎంతో ఘనకీర్తి ఉన్న విద్యుత్ సరఫరా సంఘాన్ని కాపాడుకుంటామని, ఇందుకు పాలకవర్గంతో పాటు, ప్రతినిధులు, వినియోగదారుల సహకారంతో న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నట్లు చెప్పారు.

# క్రీడల్లో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతాం

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

### ఘనంగా ముగిసిన అఖిల భారత పోలీసు ఫుట్‌బాల్ టోర్నమెంట్



ఆదివారం గచ్చిబౌలిలోని బాలయోగి స్టేడియంలో 74వ బిఎన్ మల్లిక్ అఖిల భారత పోలీసు ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఛాంపియన్‌షిప్ ముగింపు వేడుకల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో రెండు వారాలుగా కొనసాగుతున్న 74వ బిఎన్ మల్లిక్ అఖిల భారత పోలీసు ఫుట్‌బాల్ టోర్న మెంట్ ఛాంపియన్‌షిప్ ముగింపు వేడుకలు ఆదివారం గచ్చిబౌలిలోని బాలయోగి స్టేడియంలో ఘనంగా ముగిశాయి. ముగింపు వేడుకలకు సిఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్న అన్ని రాష్ట్రాలు, పారా మిలటరీ బలగాల ఫుట్‌బాల్ జట్ల క్రీడాకారులను త నదైనశైలిలో ప్రసంగించి ఉత్తేజపరిచారు. దేశంలో ఫుట్‌బాల్ ఆటకు ఒకప్పుడు హైదరాబాద్ కేరాఫ్‌గా వుండేదని, ఇక్కడి నుంచి అనేక మంది క్రీడాకా రులు భారత్ తరపున ఒలింపిక్స్‌లో పాల్గొన్నారని 1956 ఒలింపిక్స్‌లో భారత ఫుట్‌బాల్ జట్టులోని ఏడుగురు క్రీడాకారులు హైదరాబాద్‌కు చెందిన వారని సిఎం తెలిపారు. భారత ఫుట్‌బాల్ చరిత్రలో ఇదో స్వర్ణయుగమని సిఎం అన్నారు. 1950 నుంచి 1970 వరకు భారత ఫుట్‌బాల్‌ను హైదరాబాద్ శాసించిందని ఆయన తెలిపారు. ఇక హైదరాబాద్ పోలీసు జట్టు దశాబ్దాల పాటు దేశంలో ఫుట్‌బాల్ ఛాంపియన్‌గా వుందని ఆయన చెప్పారు. ఇది అప్పటి క్రీడాకారుల సత్తాకు నిదర్శమని ఆయన అన్నారు. మళ్లీ ఆ రోజులు రావాలని, హైదరాబాద్ నుంచి అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారులు తయారు కావాలని సిఎం ఆకాక్షించారు. ఇది కష్టమే అయినా అసాధ్యం కాదని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్‌లో స్పోర్ట్స్ యూనివర్శిటీని ఏర్పాటు చేశామని సి ఎం తెలిపారు. ఈ యూనివర్శిటీ పాలకులుగా అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని, అర్జున అవార్డులు సహా అనేక అవార్డులు సాధించిన వారిని నియ మించామని ఆయన తెలిపారు. విద్యతో పాటు క్రీడల్లో యువత రాణించాలని, క్రీడల్లో రాణించిన యువతకు ఉద్యోగాలిస్తామని పేర్కొన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ యూనివర్శిటీ నుంచి భవిష్యత్తులో కచ్చితంగా జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు వస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచంలో చిన్న చిన్న దేశాలు సైతం ఒలింపిక్స్‌లో అనేక పతకాలు సాధిస్తుండగా భారత్ ఒకటి అరా పతకాల కోసం నానా పాట్లు పడుతుండడం బాధగా వుందని, దీనిని యువ క్రీడాకారులు ముఖ్యంగా పోలీసు విభాగాల్లో వున్న వారు తీర్చాలని సిఎం కోరారు.

దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలతో పాటు పారా మిలటరీ బలగాలతో కూడిన 34 జట్లు పాల్గొన్న బిఎన్ మల్లిక్ 74వ టోర్నమెంట్‌ను తెలంగాణ పోలీసు విభాగం అద్భుతంగా నిర్వహించిందని సిఎం కొనియాడారు. బిఎన్ మల్లిక్ దేశ నిఘా విభాగాన్ని అత్యుత్తమ స్థాయికి తీసుకువెళ్లిన గొప్ప పోలీసు అధికారిగా సిఎం పేర్కొన్నారు. ఆయన పేరిట ఈ టోర్నమెంట్ నిర్వహించడం ఎంతో మంచిదని సిఎం తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో పా ల్గొన్న క్రీడాకారులు అద్భుత ప్రదర్శన చేశారని సిఎం కొనియాడారు. పోలీసు విభాగాల్లో ఉత్తమ ఫుట్‌బాల్ క్రీడాకారులు వున్నట్లు తాను చూశానని ఆ యన తెలిపారు. తెలంగాణకు చెందిన అంతర్జాతీయ బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్, వరల్డ్ క్రికెట్ ఛాంపియన్ సిరాజుద్దీన్‌లకు గ్రూప్ వన్ కింద పోలీసు శాఖలో డిఎస్‌పిలుగా ఉద్యోగాలు ఇచ్చామని, పారా ఒలింపింక్స్‌లో పతకం సాధించిన దీప్తి దివాంజికి గ్రూప్ 2 ఉద్యోగం ఇచ్చామని, భవి ష్యత్తుల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులను ఇదే రీతిన గౌరవిస్తామని సిఎం తెలిపారు. దేశంలో సైబర్ క్రైం, డ్రగ్స్ కేసులు పెరుగుతుండడం ఆందోళనగా వుందని, వీటిని పోలీసు విభాగాలు సమన్వయంతో అరికట్టాలని ఆయన కోరారు.

క్రీడా శాఖ మంత్రి వాంకిటి శ్రీహరి మాట్లా డుతూ తెలంగాణ పోలీసు శాఖ 74వ బిఎన్ మల్లిక్ అఖిల భారత పోలీసు ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఛాంపియన్‌షిప్‌ను ఘనంగా నిర్వహించిందని కొనియాడారు. ఇది చాలా పెద్ద విషయంగా ఆయన తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి స్వతహాగా ఫుట్‌బాల్ ప్రేమికుడని, మంచి క్రీడాకారుడని ఆయన తె లిపారు. ఆదివారం నాడు హైదరాబాద్‌లో జరిగిన ఐపిఎల్‌ను కాదని సిఎం పోలీసుల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు వచ్చారని శ్రీహరి తెలిపారు.

అనంతరం జరిగిన కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన సిఐఎస్ఎఫ్ జట్టుకు ట్రోఫిని అందించారు. దీంతో పాటు ఉత్తమ క్రీడాకారులు, క్రీడాకారిణులకు ప్రత్యేకంగా అవార్డులు అందించారు. ఈ సమావేశంలో స్పోర్ట్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, డిజిపి శివధర్ రెడ్డి, ఐబి స్పెషల్ డైరక్టర్ స్వప్న తివారి, పోలీసు అకాడమి డైరక్టర్ అభిలాష్ బిస్త్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరక్టర్ శిఖా గోయల్, సైబరాబాద్ పోలీసు కమి షనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పోలీసు క్రీడాకారుల కవాతు ఆహుతులను అలరించింది.

# ఆర్థిక సంవత్సరం తొలి క్వార్టర్‌లో రూ.18,900 కోట్ల రుణానికి ఇండెంట్

### 7న రూ.3,900 కోట్లు సేకరణ

### కొత్తగా బెంచ్ మార్క్

### స్ట్రాటజీలో తెలంగాణ చేరిక

**హైదరాబాద్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త :** కొత్త ఆర్థిక సంవత్సరం 2026-27 మొదటి త్రైమాసికంలో (ఏప్రిల్ నుండి జూన్ నెల వరకూ) బాండ్ల వేలం ద్వారా రూ.18,900 కోట్ల రుణాన్ని సమీకరించాలని రాష్ట్ర సర్కార్ నిర్ణయించింది. ఈ మేరకు దీనికి సంబంధించి రాష్ట్ర ఆర్థిక శాఖ రిజర్వ్ బ్యాంక్‌కు ఇండెంట్ పెట్టింది. ఇటీవల అసెంబ్లీ ఆమోదించిన రాష్ట్ర బడ్జెట్‌లో పేర్కొన్న విధంగా, ఈ ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ రుణాల ద్వారా రూ.73,383 కోట్లు సమీకరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలో భాగంగా తొలి క్వార్టర్‌కు ఈ ప్రతిపాదిత రుణం తీసుకోనుంది. రిజర్వ్ బ్యాంక్‌కు సమర్పించిన రుణాల క్యాలెండర్ ప్రకారం, విడతల వారీగా ఈ రుణాన్ని సమీకరించాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 7న రూ.2 వేల కోట్లు, మరో రూ.1,900 కోట్లు ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను వేలం వేయడం ద్వారా తీసుకోనుంది. అలాగే ఇదే నెల 21న ఒక్కొక్కటి రూ.1,000 కోట్ల చొప్పున మూడు బాండ్లపై రూ.3 వేల కోట్లు, మే 5న ఒక్కొక్కటి రూ.2 వేల కోట్ల చొప్పున రెండు విడతలుగా రూ.4 వేల కోట్లు, 19న రూ.750 కోట్లు, రూ.500 కోట్లు, రూ.750 కోట్లు, జూన్ 2న ఒక్కొక్కటి రూ.2 వేల కోట్ల చొప్పున రెండు విడతలుగా రూ.4 వేల కోట్లు, 16న రూ.750 కోట్లు, రూ.750 కోట్లు, రూ.500 కోట్ల మేర రుణాలు చేయనుంది. కాలక్రమేణా తిరిగి చెల్లించే బాధ్యతలను సమానంగా పంపిణీ చేయడానికి, రుణాలను వివిధ కాలపరిమితులలో రూపొందించారు. రుణాలలో గణనీయమైన భాగం 16-20 సంవత్సరాలుగా ఉండగా, 21-25 ఏళ్లు, 25 సంవత్సరాలకు పైబడిన దీర్ఘకాలిక తిరిగి చెల్లింపు కాలపరిమితులను కలిగి ఉంటాయని ప్రణాళికలో ఆర్థిక శాఖ పేర్కొంది. అయితే కొన్ని రుణాలను 6-10 ఏళ్లు, 11-15 సంవత్సరాల స్వల్పకాలిక కాల పరిమితులతో ప్రతిపాదించింది. కాగా రాష్ట్రాల అంగీకారంతో, 2026-27 నుండి పైలట్ ప్రాతిపదికన బెంచ్‌మార్క్ ఇష్యూయెన్స్ స్ట్రాటజీ (బిఐఎస్)ని ప్రవేశపెట్టాలని ఆర్‌బిఐ నిర్ణయించింది. ఈ చొరవలో తొమ్మిది రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బీహార్, ఛత్తీస్‌గఢ్, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ చేర్చబడ్డాయి. దీని కింద, ముందుగా ప్రకటించిన క్యాలెండర్ ప్రకారం నిర్దిష్ట బెంచ్‌మార్క్ టెనర్‌లలో సెక్యూరిటీలు జారీ చేయబడతాయి. గత ఆర్థిక సంవత్సరంలో (2025-26), రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ రుణాల కోసం రూ.64,539 కోట్లు బడ్జెట్‌లో కేటాయించగా, లక్ష్యాన్ని అధిగమించి రూ.84,188 కోట్లు సమీకరించింది. రాష్ట్ర ఖజానాపై రుణ సేవా భారాన్ని తగ్గించడానికి, గత ప్రభుత్వం తీసుకున్న రుణాలను పునర్వ్యవస్థీకరించడం, అధిక వడ్డీ రుణాల స్థానంలో తక్కువ వడ్డీ రుణాలను తీసుకోవడం, తిరిగి చెల్లింపు గడువును పొడిగించడం వంటి చర్యల వల్లే ఈ అధిక రుణాలు సాధ్యమయ్యాయని రాష్ట్ర ఆర్థిక శాఖ అధికవర్గాలు వెల్లడించాయి.

# పార్టీలు మారడం.. బట్టలు మార్చినంత ఈజీ కాదు

### ఎంపి ఈటల రాజేందర్

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమంలో సబ్బండ వర్గాల ప్రజలతో కలిసి ఒక తెలంగాణ గడ్డపై పుట్టిన ఉద్యమబిడ్డగా ప్రజలతో కలిసి ప్రత్యేక తెలంగాణ సాధనకోసం తాను చేసిన పోరాట ప్రతిమ రాష్ట్ర ప్రజలకు నా హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలకు తెలుసని రాష్ట్ర మాజీ మంత్రి, బిజెపి ఎంపి ఈటల రాజేందర్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అనాడు నేను బిఆర్ఎస్ పార్టీలో ఉంటే.. వాళ్ల ఆటలు సాగవని, వాళ్ల బండారం బయట పెడుతానని భయబ్రాంతులకు గురైన ఆ కుటుంబం నన్ను బిఆర్ఎస్ పార్టీ నుండి అర్ధాంతరంగా బయటకి గెంటివేసి ఐదేళ్ల అవుతుంది. ఆనాడు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తున్న భారతీయ జనతా పార్టీలో రాష్ట్ర, కేంద్ర పార్టీ నేతల ఆశీస్సులతో ఆ పార్టీలో చేరాను. నాటి నుండి నేటి వరకు ఆ పార్టీ బలోపేతానికి బిజెపి కార్యకర్తగా, ఒక పార్లమెంట్ సభ్యునిగా తన వంతుగా కృషి చేస్తున్నానని ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గంలో 2023లో జరిగిన సాధారణ అసెంబ్లీ ఎన్నికలలో కొంతమంది గారడీ మాటలు నమ్మి మోసపోయిన హుజురాబాద్ ప్రజలు రెండు సంవత్సరాలుగా బాధపడుతున్నారు. వారంత నాడు నా వెంట బిఆర్ఎస్ పార్టీలో ఉన్నావారే.. ఈనాడు ఆ పార్టీలో అధిక సంఖ్యలో ఉన్నారు. నేను హుజురాబాద్‌లో శాసనసభ్యునిగా లేనన్న విషయం వారందరిని బాధిస్తుంది. వారితో ఉన్న సంబందాలతో కొంతమంది పైశాచిక ఆనందంతో తాను పార్టీ మారబోతున్నానని, కరీంనగర్ లాంటి పట్టణంలో తనపై పోస్టర్లు వేయించడం వారి స్వభావానికి వదిలేస్తున్నాను. ప్రజల కష్టసుఖాలు తెలుసుకుని, పరిణతి చెందిన ఏ రాజకీయ నాయకుడైన ఒక పార్టీ నుండి మరో రాజకీయ పార్టీ మారడానికి ఒంటిపై ఉన్న బట్టలు మార్చినంత ఈజీ కాదని ఈటల రాజేందర్ వాడిగా, వేడిగా అన్నారు.

పార్టీలు మారకూడదనే నేనే పలుమార్లు సందేశం ఇచ్చాను. నా గురించి తెలంగాణ సమాజానికి, నా రాజకీయ నిబద్ధత గురించి నాకంటే వారికే తెలుసన్నారు. రాష్ట్రంలో ముఖ్యంగా హుజురాబాద్ నియోజకవర్గంలో 25ఏళ్లుగా రాజకీయ జీవితంలో ఉన్న తాను అత్యధికంగా పరిచయస్తులు ఉంటారు. అభిమానించేవారు ఉంటారు. ఇప్పటికే వారంత అయ్యో.. ఈటలను దూరం చేసుకున్నాం.. కేసిఆర్ ఈటలను బాధపెట్టి పెద్ద తప్పుచేసారని రాష్ట్ర వ్యాప్తంగా చర్చ నేటికి జరుగుతుంది. మళ్లి వీరందరు కేసిఆర్‌తో కలుస్తారని, అదో రకమైన చర్చ జరుగుతుంది. అలాంటి పిచ్చి పనులు చేయవద్దని మనవి చేస్తున్నానని ఈటల అన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎంపి ఈటల రాజేందర్

# కార్పొరేట్ విద్యాసంస్థల బ్రాండ్ అంబాసిడర్‌గా మారిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

### తీవ్రంగా విమర్శించిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ

**హైదరాబాద్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్పొరేట్ విద్యాసంస్థల బ్రాండ్ అంబాసిడర్‌గా మారారని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా విమర్శించింది. ప్రభుత్వ విద్యను కావాలనే దెబ్బతీస్తున్నారని సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రైవేట్ పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన బాధ్యత వహించాల్సిన సమయంలో.. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలకు బహిరంగంగా మద్దతు తెలపడం అత్యంత ఆందోళనకరమన్నారు. రాష్ట్రంలో వందలాది ప్రభుత్వ పాఠశాలలు మూత పడే పరిస్థితి నెలకొని ఉండగా, వాటిని రక్షించాల్సిన ప్రభుత్వం వాటి బల హీనతలను ఎత్తిచూపడం ద్వారా ప్రజల్లో అవిశ్వాసం పెంచే ప్రయత్నం చేస్తోందన్నారు. విద్యార్థులకు సరైన పఠనా నైపుణ్యాలు లేవని చెప్పడం ద్వారా ప్రభుత్వవిద్యను అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. విద్యా శాఖపై పూర్తి బాధ్యత కలిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలకు తగిన నిధులు కేటాయించకుండా, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయకుండా,మౌలికవసతులు కల్పించకుండా నిరక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు.

# కాంగ్రెస్ బెదరింపులు, రాజకీయ దుర్వినియోగం బిజెపిని ఆపలేకపోయింది

### ఖానాపూర్‌లో గెలుపే నిదర్శనం

### పార్టీ రాష్ట్ర ముఖ్యఅధికారప్రతినిధి ఎన్‌వి సుభాష్

**హైదరాబాద్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:** ఖానాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం బిజెపి కైవసం చేసుకోవడం సంతోషంగా ఉందని బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి ఎన్ వి సుభాష్ అన్నారు. ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్-ఎంఐఎం కుట్రలను ఛేదించి కాషాయం జెండా ఎగురవేశామన్నారు. అధికార కాంగ్రెస్ బెదిరింపులు, ఒత్తిళ్లు, రాజకీయ దుర్వినియోగం ఏదీ బిజెపిని ఆపలేకపోయిందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుతూ పోరాడి గెలిచిన బిజెపి ఖానాపూర్‌లో కాంగ్రెస్ అహంకారానికి గట్టి చెక్ అన్నారు. మొన్న నిజామాబాద్‌లో కాంగ్రెస్-ఎంఐఎం కుమ్మక్కు బహిర్గతం అయిందన్నారు. ఖానాపూర్‌లో సైతం అదేతీరు మరోసారి సుస్పష్టం అయిందన్నారు. ఎంఐఎం-కాంగ్రెస్ కలిసి చేసిన కుతంత్రాలకు సమాధానం ప్రజలు చెప్పారన్నారు. అవకతవకలు, ప్రలోభాలు, ఒత్తిళ్ల మధ్య కూడా బిజెపి వెనక్కి తగ్గలేదని, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు నాయకత్వంలో బిజెపికి కీలక విజయం అందిందన్నారు. అవకతవకలు, ప్రలోభాలు, ఒత్తిళ్ల మధ్య కూడా బిజెపి కార్యకర్తలు వెనక్కి తగ్గలేదన్నారు. అధికార దుర్వినియోగానికి కాషాయం కౌంటర్ ఇచ్చిందన్నారు. బిజెపి శాసనసభ పక్ష నాయకులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి సమన్వయం ఫలితం, ఆదిలాబాద్ ఎంపి గోడం నగేష్ మార్గదర్శకత్వంతో బిజెపి మరింత బలపడిదన్నారు. స్థానిక నాయకత్వం, కేడర్ కష్టానికి ఫలితంగా ఖానాపూర్ విజయం సాధించామన్నారు. కాంగ్రెస్ చేసిన ప్రతి కుట్రకు బిజెపి గట్టి సమాధానం ఇచ్చిందన్నారు. ప్రజల మద్దతే బిజెపికి అసలైన శక్తి అని మరోసారి రుజువు అయిందన్నారు. తెలంగాణలో ప్రత్యామ్నాయంగా బిజెపికి ఎదుగుతుందనడానికి స్పష్టమైన సంకేతం అన్నారు.

# అర్ధరాత్రి అకాల వర్షాల బీభత్సం

### ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు

### పలు ప్రాంతాల్లో రోడ్లపై విరిగిపడిన వృక్షాలు..

### రాకపోకలకు తీవ్రఅంతరాయం

### నేలవాలిన మొక్కజొన్న.. రాలిపోయిన మామిడి కాయలు,

### తడిసి ముద్దయిన ఆరబోసిన ధాన్యం

**హైదరాబాద్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త :** తెలంగాణలోని పలు జిల్లాల్లో శని వారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. పలు జిల్లాల్లో శనివారం అర్ధరాత్రి , ఆదివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ , నిజామాబాద్, రంగారెడ్డి, కరీంనగర్ జిల్లాల్లో అకాల వర్షాలు రైతులను నిండా ముంచాయి. సామాన్య జనజీవనానికి తీవ్ర ఇబ్బందులు కలిగించాయి. కామారెడ్డి, సిరిసిల్ల జిలాల్లో ఉరుములు, మెరుపులతో వర్షం బీభత్సం సృష్టించింది. సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, మెదక్‌లో భారీ వాన కురిసింది. రాజన్న సిరిసిల్లలోని ఎల్లారెడ్డిపేట మండలంలో తెల్లవారుఝామున 3 గంటల నుంచి ఉరుములు, మెరుపులతో భారీ వర్షంకురిసింది. దీంతో పలు ప్రాంతాల్లో చెట్లు విరిగిపోయి రోడ్లకు అడ్డంగా పడిపోయాయి. వర్షం దాటికి రోడ్లు, మురికికాలువలు జలమయమయ్యాయి. కళ్లాల్లో ధాన్యం తడిసిపోయింది. మామిడితోటల్లో కాయలు రాలిపోయాయి. వీర్నపల్లి మండలకేంద్రంలో శనివారం రాత్రి వీచిన బలమైన ఈదురుగాలులు, వడగండ్ల వర్షం రైతన్నలను నిండా ముంచాయి. సబ్ స్టేషన్ నుంచి వన్‌పల్లివెళ్లే ప్రధాన రహదారిపై కిలోమీటర్ పొడవునా భారీ వృక్షాలు, విద్యుత్ స్తంబాలు నేలకొరిగాయి. కరెంట్ పోల్స్ నేలకొరగడంతో విద్యుత్ సరఫరా స్తంభించింది. అటు కరీంనగర్ జిల్లాలోని సైదాపూర్ మండలం లస్మన్నపల్లి, ఆరెపల్లి, వెన్నంపల్లి, సోమారం, ఎక్లాసూర్ తదితర గ్రామాల్లోరాత్రి నుంచి ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది.

ఇక కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం కన్కల్ తాడ్వాయి రోడ్డుపై శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి చెట్లు నేలకొరిగాయి. దీంతో కామారెడ్డి వైపు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు చోట్ల మొక్కజొన్న పంట మొత్తం తడిసిపోయింది. అటు కామారెడ్డి పట్టణంలో భారీ వర్షం కురిసింది. బస్టాండ్, రైల్వే స్టేషన్ సమీపంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బతుకమ్మ కుంట, ఇందిరా నగర్ ప్రాంతాల్లో పాదాచారులు, చిరువ్యాపారులు ఇబ్బంది పడ్డారు. ఈ నేపథ్యంలో అకాల వర్షాల హెచ్చరికలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ప్రస్తుతం రైతులు రబీలో సాగుచేసిన పంటలు ప్రస్తుతం చేతికందే దశలో ఉన్నాయి. పలు ప్రాంతాల్లో పంట ఉత్పత్తులు కల్లాల్లో ఆరబోశారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలతో రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. వరి, మొక్కజొన్న, మిరప తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా రైతులు సాగుచేసిన పంటలు దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# ఆధార్‌కార్డు భక్తులకు రెండు లడ్డూలు

**తిరుమల, ఏప్రిల్ 5 ప్రభాతవార్త ప్రతినిధి:** గ్యాస్ ప్రభావం టిటిడిపై మెల్లగా చూపుతోంది. ఇప్పటికే తిరుమల లడ్డూ ప్రసాదాల తయారీకి సంబంధించి కొంత తక్కువ మేరకు తయారవుతున్నట్లు టిటిడి వర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో లడ్డూ వితరణ శాల వద్ద ఆదివారం భక్తులు స్వయంగా వస్తే వారి ఆధార్‌కార్డు ఆధారంగా కేవలం రెండు లడ్డూలు మాత్రమే అందుకోవచ్చని వెల్లడి. శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం తరువాత భక్తులు అంతటి పవిత్రంగా భావించే దేవుని ప్రసాదం లడ్డూలకు కొన్ని ఇబ్బందులు పడాల్సి వస్తోందనేది భక్తుల్లో అసహనం. దేవుని దర్శనం చేసుకున్న ప్రతి భక్తునికి ఒక లడ్డూ ఉచితంగా అందిస్తున్నారు. ఇలా ఒక కుటుంబంలో ఐదారుమంది వస్తే ఐదు లడ్డూల వరకు ఉచితంగానే అందుకుంటున్నారు. ఇంకా అదనంగా లడ్డూలు కావాల్సిన భక్తులు ఎటువంటి ఆధారాలు లేకుంటే అదనపు లడ్డూలు పొంద డం కష్టమైంది. ఆధార్‌కార్డు ఆధారంగా ఒక భక్తునికి 2లడ్డూలు రూ.100 లకు విక్రయిస్తున్నారు. ఒక భక్తుడు 5, 10లడ్డూలు పొందాలంటే మాత్రం అవకాశం లేకపోతోందని కొందరు భక్తులు అసహనం చెందుతున్నారు.

ఆట



# ఉప్పల్‌లో రైజింగ్ ఫ్లాప్ షో

## టాప్ లేపిన షమీ ● క్లాసెన్, నితీష్ మెరుపులు ● లక్నో గెలుపు బోణీ

**ఉత్కంఠ రేపిన ఫైనల్‌ఓవర్లో విజయానికి కావాల్సిన తొమ్మిది పరుగులు సాధించి లక్నో సూపర్ జెయింట్స్... ఐపీఎల్ 2026 సీజన్‌లో గెలుపు బోణీ చేసింది. రిషబ్ పంత్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. చివరి వరకు క్రీజ్‌లో నిలిచాడు. బ్యాటింగ్‌లో విఫలమైన సన్ రైజర్స్... స్వల్పలక్ష్యాన్ని కాపాడుకోలేక సొంతగడ్డపై ఓటమి ఎదుర్కొంది.**

**కోల్‌కతా:** ఐపీఎల్2026 సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ తొలి విజయం నమోదు చేసింది. ఆదివారం ఉప్పల్ మైదానం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఎస్ఆర్‌హెచ్ నిర్దేశించిన 157 పరుగుల లక్ష్యాన్ని మరో బంతి ఉండగానే అయిదు వికెట్లు కోల్పోయి అందుకుంది.

**పంత్ కెప్టెన్ ఇన్నింగ్:** ఇక 157 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నో ఇన్నింగ్స్‌ను మిచెల్ మార్ష్‌తో కలిసి మార్క్రమ్ ఆరంభించాడు. ఓపెనర్‌గా వచ్చే రిషబ్ పంత్...తన స్థానాన్ని మిచెల్ మార్ష్‌కు త్యాగం చేశాడు. ఓపెనర్లు ధాటిగా ఇన్నింగ్స్ ఆరంభించారు. తొలి వికెట్‌కు 37 రన్స్ జోడించారు. ఈ దశలో మిచెల్ మార్ష్(14)ను మలింగ అవుట్ చేశాడు. ఈ దశలో మార్క్రమ్‌తో కలిసి రిషబ్ పంత్ ఇన్నింగ్స్‌ను చక్క దిద్దాడు. ఒకవైపు మార్క్రమ్ సిక్స్‌లు, ఫోర్లతో అలరిస్తే, రిషబ్ తన సహజశైలికి భిన్నంగా ఆచితూచి ఆడాడు. ఆరు ఫోర్లు, 2 సిక్స్‌లతో ధాటిగా ఆడిన మార్క్రమ్(27 బంతుల్లో 45) ను శివంగ్ పెవలియన్‌కు పంపాడు. ఈ జోడీ రెండో వికెట్‌కు 40 రన్స్ జోడించింది. మార్క్రమ్ ఔటైన తర్వాత పంత్ బౌండరీలతో అలరించాడు. మరోవైపు వెంటవెంటనే బదోని(12), పూరన్(10), సమద్(16) వికెట్లు కోల్పోవ డంతో మ్యాచ్ ఉత్కంఠకు చేరింది. చివరి ఓవర్లో విజయానికి 9 పరుగులు చేయాల్సిన పరిస్థితి. ఉనద్కత్ వేసిన మొదటి రెండు బంతుల్లో రిషబ్ బ్యాక్ టు బ్యాక్ ఫోర్లు బాదాడు. ఆ తర్వాతి రెండు బంతులు డాట్‌గా ఆడిన అయిదో బంతికి బౌండరీతో ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు. పంత్ 50 బంతుల్లో 9 ఫోర్లతో 68 పరుగులు సాధించి అజేయంగా నిలిచాడు. ఉన ద్కట్ భారీగా పరుగులిచ్చాడు. 3.5ఓవర్లలో ఏకం గా 50రన్స్ సమర్పించుకున్నాడు. ఎస్ఆర్‌హెచ్ బౌలర్లలో హర్ష్ దూబే రెండు వికెట్లు సాధించ గా..ఎషాన్ మలింగ, శివాంగ్ కుమార్ తలా వికె ట్ పడగొట్టారు. తొలి మ్యాచ్‌లో ఆర్సీబీ చేతిలో ఓడిన ఎస్ఆర్‌హెచ్.. రెండో మ్యాచ్‌లో కేకేఆర్‌పై



పంత్ కెప్టెన్ ఇన్నింగ్

### క్లాసెన్, నితీష్ హాఫ్ సెంచరీలు

సన్‌రైజర్స్‌ను హెన్రిచ్ క్లాసెన్(75 బంతుల్లో 62), నితీష్ కుమార్ రెడ్డి(33 బంతుల్లో 56) ఆదుకున్నారు. మరోవికెట్ పడకుండా ఆరంభంలో జాగ్రత్తగా ఆడారు. క్రీజ్‌లో కుదురుకున్నాక, 11వ ఓవర్‌వేసిన ప్రిన్స్ బౌలింగ్‌లో చెరో సిక్స్‌తో ఎస్ఆర్‌హెచ్ స్కోరును 50 మార్కు దాటించారు. ఈ ఓవర్లో 16 పరుగులు వచ్చాయి. ఆ ఓవర్ తర్వాత వీరిద్దరూ మరింత జోరు చూపారు. 14వ ఓవర్లో అవేష్‌పై నాలుగు బౌండరీలు బాది 19 పరుగులు క్లాసెన్ సాధిస్తే... నేనేం తక్కువ తిన్నానా అన్నట్లు రాఠీ వేసిన 15వ ఓవర్లో మూడు సిక్సర్లతో విరుచుకుపడి నితీష్ రాణా 22 రన్స్ సాధించడంతో ఎస్ఆర్‌హెచ్ స్కోరు 100 దాటింది. అదే జోరు కొనసాగిస్తూ క్లాసెన్, నితీష్ చెరో అర్ధసెంచరీ నమోదుచేశారు. వీరిద్దరూ అయిదో వికెట్‌కు 63 బంతుల్లో 116 రన్స్ జోడించారు. 19వ ఓవర్లో అవేష్ 2 వికెట్లు, 20వ ఓవర్లో ప్రిన్స్ యాదవ్ రెండు వికెట్లు తీయడంతో ఎస్ఆర్‌హెచ్ నిర్ణీత 20 ఓవర్లలో9 వికెట్లకు 156 రన్స్ చేసింది. లక్నో బౌలర్లలో షమీ, ప్రిన్స్, అవేష్ ఖాన్ తలా రెండేసి వికెట్లు పడగొట్టారు.



### వణికించిన షమీ, తడబడ్డ ఎస్ఆర్‌హెచ్

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ ఆరంభం తడబడింది. గత మ్యాచ్‌లోలాగా దుమ్మురేపుతుందనుకున్న టాప్ ఆర్డర్‌పై మహ్మద్ షమీ నిప్పులు చెరిగాడు. ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే అద్భుతమైన బంతితో అభిషేక్ శర్మ(డకౌట్)ను బోల్తా కొట్టించిన షమీ.. తరువాతి ఓవర్లో విధ్వంసకర బ్యాట్స్‌మెన్ ట్రావిస్ హెడ్(7)ను మార్క్రమ్ క్యాచ్‌తో పెవిలియన్‌కు పంపాడు.తన మాజీ జట్టును వణికించిన షమీ...4 ఓవర్లలో కోటాలో కేవలం 9 పరుగులిచ్చి రెండు వికెట్లు తీశాడు.

కెప్టెన్ ఇషాన్ కిషన్(1) కూడా నిరాశపరిచాడు. అతన్ని ప్రిన్స్ యాదవ్ చక్కని ఇన్ స్వింగర్‌తో క్లీన్ బౌల్డ్ చేశాడు. క్రీజ్‌లోకి వచ్చిన లివింగ్‌స్టోన్ ఓ సిక్స్‌తో ధాటిగా ఆడే ప్రయత్నంచేసినా.. రిషబ్ పంత్ అద్భుత క్యాచ్‌తో స్పిన్నర్ దిగ్వేష్ రాఠీ బోల్తా కొట్టించాడు. దీంతో సన్ రైజర్స్ 26 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. పవర్ ప్లే ఆరు ఓవర్లలో 22 పరుగులే వచ్చాయి. ఈ ఐపీఎల్ సీజన్‌లో ఇవే తక్కువ పరుగులు. పది ఓవర్లు పూర్తయ్యేసరికి సన్‌రైజర్స్ హైదరాబాద్ స్కోరు 35 రన్స్ మాత్రమే.

## చెన్నైపై ఆర్సీబీ గ్రాండ్ విక్టరీ

**బెంగళూర్:** డిపెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూర్ ... సొంతగడ్డపై దుమ్మురేపుతోంది.వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఘన విజయం సాధించింది. మరోవైపు ఈ ఓటమితో చెన్నై సూపర్ కింగ్స్ ఖాతాలో మూడో పరాజయం చేరింది.

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీకి ఓపెనర్లు ఫిల్ సాల్ట్(30 బంతుల్లో 46), విరాట్ కోహ్లీ(18 బంతుల్లో 28) ఫ్లయింగ్ స్టార్ట్ ఇచ్చారు. వచ్చిన వారు వచ్చినట్లే చెన్నై బౌలర్లపై సిక్స్‌లు, ఫోర్లతో విరుచుకుపడ్డారు. దేవదత్ పడిక్కల్ మరో హాఫ్ సెంచరీతో మెరిశాడు. కేవలం 29 బంతుల్లోనే 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో వరుసగా రెండో అరసెంచరీ సాధించాడు.ఇక కెప్టెన్ రజత్ పాటిదార్, టిమ్ డేవిడ్‌లైతే చెన్నై బౌలర్లకు చుక్కలు చూపారు. ఓవర్టన్ ఓవర్లో టిమ్ డేవిడ్ ఏకంగా 4 సిక్స్‌లు, ఓ ఫోర్‌తో సహా 30 రన్స్ బాదాడు. వీరిద్దరూ చివరి 5 ఓవర్లలో మెరుపు వేగంతో 97 రన్స్ అందించారు.రజత్ పాటిదార్ 19 బంతుల్లో 6 సిక్స్‌లతో 48 రన్స్.. టిమ్ డేవిడ్ 25 బంతుల్లో 8 సిక్స్‌లతో 70 రన్స్ చేసి అజేయంగా నిలిచారు. దీంతో ఆర్సీబీ స్కోరు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 250 పరుగులకు చేరింది. 251 రన్స్ భారీ లక్ష్యంతో దిగిన సీఎస్‌కేను ఆరంభంలోనే డిఫీ, భువనేశ్వర్ దెబ్బ తీశారు. సంజూ శామ్సన్(9), రుతురాజ్(7)లను డఫీ అవుట్ చేయగా.. ఆయుష్(1)ను భువనేశ్వర్, కార్తిక్ (6)ను కృణాల్ పాండ్య పెవలియన్ చేర్చారు. సర్ఫరాజ్(25 బంతుల్లో50), ప్రశాంత్ వీర్(29 బంతుల్లో 43), జేమీ ఓవర్టన్(16 బంతుల్లో 37) రాణించారు.





**కోల్‌కతా:** ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్ నేడు పంజాబ్ కింగ్స్‌తో తలపడనుంది. పేలవమైన ఆటతీరుతో నైట్‌రైడర్స్ ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడింది. ఈ మ్యాచ్‌లోనైనా గెలుపు బోణీ చేయాలని ఉవ్విళ్లూరుతోంది. మరోవైపు పంజాబ్ కింగ్స్ అన్‌స్టాపబుల్‌గా కొనసాగుతోంది. వరుసగా మూడో మ్యాచ్ నెగ్గి హ్యాట్రిక్ విజయం అందుకోవడంపై ఫోకస్ పెట్టింది.

మూడుసార్లు ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను బ్యాటింగ్ ఆందోళన పరుస్తోంది. కెప్టెన్ అజింక్య రహానేతో పాటు ఫిన్ అలెన్, కామెరూన్ గ్రీన్, సునీల్ నరైన్ దారుణంగా విఫలమవుతున్నారు. ఒక్క రఘువంశీ మాత్రమే బ్యాట్‌తో రాణిస్తున్నాడు. గత మ్యాచ్‌తో రింకు సింగ్ కూడా పరుగుల వేటలో పడ్డాడు. ఈ మ్యాచ్‌కు రచిన్ రవీంద్రను తీసుకోవడం ఖాయమవడంతో బ్యాటింగ్, బౌలింగ్‌కు అదనపు బలం. ఏస్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి భారీగా పరుగులు ఇస్తుండడం, మిగతా బౌలర్లు ప్రత్యర్థిని కట్టడి చేయడంలో విఫలమవుతున్నారు. ఈ లోపాలను అధిగమించడంపై కేకేఆర్ దృష్టి సారించింది.

మరోవైపు శ్రేయాస్ అయ్యర్ నేతృత్వంలోని పంజాబ్ కింగ్స్ బ్యాటింగ్, బౌలింగ్‌లో పటిష్టంగా ఉంది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గి ఫుల్ జోష్‌తో ఈ మ్యాచ్ బరిలోకి దిగుతోంది. కూపర్ కొన్నోలీ 3వ స్థానంలో ఇప్పటివరకు 108 రన్స్ చేసి రాణించగా.. ప్రియాన్ష్ ఆర్యా, ప్రభ్‌సిమ్రన్ సింగ్ మెరుపు ఆరంభాలను అందిస్తున్నారు. అలాగే అర్ష్‌దీప్ సింగ్, మార్కో జాన్సెన్,విజయకుమార్ వైశాఖ్, సీనియర్ స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్‌లతో కూడిన బౌలింగ్ విభాగం సమతుల్యంగా ఉంది.

కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. భారీ స్కోర్లు ఖాయం. ఆరంభంలో ఫాస్ట్ బౌలర్లకు కొంచెం సహాయం లభించవచ్చు. కోల్‌కతా నైట్ రైడర్స్, పంజాబ్ కింగ్స్ జట్లు 35 సార్లు తలపడ్డాయి. ఇందులో కేకేఆర్ 21 విజయాలతో పైచేయి సాధించగా, పీబీకేఎస్ 13 విజయాలు సాధించింది. ఒక మ్యాచ్ ఫలితం తేలలేదు.

**కోల్‌కతా నైట్ రైడర్స్:** అజింక్య రహానే (కెప్టెన్), రింకు సింగ్, ఫిన్ అలెన్, రఘువంశీ, రమన్‌దీప్ సింగ్, కామెరాన్ గ్రీన్, సునీల్ నరైన్, రచిన్ రవీంద్ర, వరుణ్ చక్రవర్తి, వైభవ్ అరోరా, బ్లెస్సింగ్ ముజరబాని; **పంజాబ్ కింగ్స్:** శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), ప్రియాంష్ ఆర్యా, ప్రభ్‌సిమ్రాన్ సింగ్, కూపర్ కన్నోల్, నెహాల్ వధేరా, మార్కో జాన్సెన్, మార్కస్ స్టోయినిస్, అర్ష్‌దీప్ సింగ్, జేవియర్ బార్ట్‌లెట్, యుజ్వేంద్ర చాహల్, విజయ్‌కుమార్ వైషాక్.





## పోలీస్ ఫుట్‌బాల్ విజేతలుగా సిఐఎస్‌ఎఫ్, అసోం రైఫిల్స్

హైదరాబాద్, ఏప్రిల్5(వార్త క్రీడా ప్రతినిధి)

హైదరాబాద్‌లోని గచ్చిబౌలీ స్టేడియం వేదికగా జరిగిన 74వ బి.ఎన్.ముల్లిక్ స్మారక ఆలిండియా పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్‌లో విజేతలుగా సిఐఎస్‌ఎఫ్, అసోం రైపిల్స్ నిలిచాయి. గచ్చిబౌలీ స్టేడియంలో జరిగిన పురుషుల ఫైనల్లో టాప్ టీమ్ సిఐఎస్‌ఎఫ్ ఏకైక గోల్‌తో గోవాపై గెలుపొంది ట్రోఫీ అందుకుంది. ఆద్యంతం ఉత్కంఠగా జరిగిన ఈ ఫైనల్లో గోవా గోల్‌చేయడంలో విఫలమైంది. సిఐఎస్‌ఎఫ్ పార్వర్డు సమన్వయంతో కదులుతూ గోల్ సాధించింది. అంతకుముందు జరిగిన మూడో స్థానం పోటీలో కేరళ 1-0తో ఒడిశాపై నెగ్గి మూడోస్థానం పొందింది. మహిళల ఫైనల్లో అసోం రైఫిల్ 1-0తో ఒడిషాపై గెలుపొందింది. సిఐఎస్‌ఎఫ్‌కు మూడోస్థానం దక్కింది. మార్చి 25 నుంచి 12 రోజుల పాటు జరిగిన పోలీస్ ఫుట్‌బాల్‌లో 43 పరుషుల జట్లు, 9 మహిళల జట్లు తలపడ్డాయి. ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. కాసేపు ఫుట్‌బాల్ ఆడి ప్రేక్షకులను అలరించారు. అనంతరం విజేతలకు ట్రోఫీలను అందజేశారు. బిజయ్ బెహారా(ఒడిశా, 8 గోల్స్), ప్యారీ(ఒడిషా, 7 గోల్స్)కు గోల్డెన్ బూట్ లభించింది. ఈ కార్యక్రమంలో క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, డిజీపీ శివధర్ రెడ్డి, శాట్ ఛైర్మన్ శివసేనారెడ్డితో పాటు పలువురు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భారత్ ఆర్థికవృద్ధి 6శాతానికి తగ్గించిన మూడీస్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 5:** అంతర్జాతీయ రేటింగ్స్ సంస్థమూడీస్ భారత్ ఆర్థికవృద్ధి అంచనాలు 6.8 నుంచి 6 శాతానికి తగ్గించింది. ప్రైవేటు వినియోగ వ్యయం క్షీణించిందని, పారిశ్రామిక కార్యకలాపాలు కూడా మందగమనంతో ఉన్నాయని, పెట్టుబడులుకూడా స్వల్పస్థాయిలోనే వస్తుండటం దీనికితోడు భౌగోళిక ఉద్రిక్తతలకారణంగా భారత్ ఆర్థికవ1ద్ధి క్షీణిస్తుందని వెల్లడించింది. ఎల్పీజీ షిప్‌మెంట్స్ సమీపభవిష్యత్తులో కొరత ఉన్నందున అధిక ఇంధన రవాణా వ్యయాలు భరించాల్సి ఉంటుంది. ఆహారద్రవ్యోల్బణం పెరగడం, ఎరువుల దిగుమతులపైనే భారత్ ఆధారపడటం వల్లకూడా ఆర్థిక వృద్ధిని ప్రభావితంచేస్తుందని అంచనావేసారు. పశ్చిమాసియాలో 55శాతం ముడిచమురు దిగుమతులు భారత్‌కే వస్తాయని ఎల్పిజి సరఫరాలో 90శాతం భారత్‌లోనే ఉంటుందని మూడీస్ వెల్లడించింది. ద్రవ్యోల్బణం కూడా 2.4శాతంనుంచి 4.8శాతానికి పెరుగుతుందని అంచనా.గతనెలలో ఒఇసిడి ఆర్థికసహకారం అభివృద్ధి సంఘం (ఒఇసిడి) కూడా భారత్ ఆర్థికవృద్ధి ప్రస్తుత ఆర్థికసంవత్సరంలో 6.1శాతంగానే ఉంటుందని అంచనావేసింది.





అంతకుముందు 2025-26లో భారత్ 7.6శాతం వృద్ధితో ఉంటుందని అంచనావేసింది. అలాగే ఎర్నెస్ట్‌యంగ్ ఇండియా వాస్తవ జిడిపి వృద్ధిఒక పర్సంటేజి పాయింట్ తగ్గుతుందని రిటైల్ ద్రవ్యోల్బణం 1.5 పర్సంటేజి పాయింట్లు పెరిగాయని, పశ్చిమాసియా ఉద్రిక్తతలు కొనసాగితే ఆర్థికవృద్ధికి విఘాతం జరుగుతుందని వెల్లడించింది. ఇక దేశీయ రేటింగ్ ఏజెన్సి ఇక్రా కూడా 6.5 శాతంగా వృద్ధిని అంచనావేసింది. ఇంధన ధరలు, సరఫరా సమస్యలే కారణమని అంచనావేసింది. 2025 కేలండర్ సంవత్సరంలో భారత్ వృద్ధి 7.5శాతంగా ఉంది. జి-20 దేశాల్లో గరిష్టస్థాయి వృద్ధిరేటుతో ఉంది. ఇటీవల విధించిన సుంకాల కోతలు కూడా పన్ను రాబడులపై విఘాతం కలిగిస్తుందన్నారు.

కేంద్ర ప్రభుత్వ రుణభారం కొంతమేర తగ్గుతుందని, 57 శాతంనుంచి 2030-31నాటికి 50శాతానికి చేరుతుందని మూడీస్ అంచనావేసింది. ప్రస్తుత భారత్ కరెంటుఖాతాలోటు జిడిపిలో 0.4శాతంగా ఉంది. అంతకుముందు ఏడాది 0.9శాతంగా ఉన్న సంగతి తెలిసిందే. 2026లో 1శాతంనుంచి 1.5శాతానికి పెరుగుతుందని దిగుమతి వ్యయాలుపెరగడమే ఇందుకు కారణమని అంచనావేసింది. గల్ఫ్‌యుద్ధం కారణంగా విదేశీ జమలు కూడా కోతపడుతున్నాయి. గల్ఫ్ ప్రాంతాలనుంచి భారత్‌కు వచ్చే జమల్లో 40శాతం తగ్గినట్లు మూడీస్ అంచనావేసింది.

## నేటినుంచి ఆర్బీఐ ఎంపిసి సమీక్ష



**ముంబయి, ఏప్రిల్ 5:** రిజర్వుబ్యాంకు ఈసారి తన మానిటరీ పాలసీ సమీక్షలో రెపోరేట్లను స్థిరంగానే కొనసాగిస్తుందన్న అంచనాలు పెరిగాయి. ఏప్రిల్ మానిటరీ పాలసీ సమావేశంలో 5.25శాతంగానే కొనసాగిస్తుందన్న అంచనాలు పెరిగాయి. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా వడ్డీరేట్ల జోలికి వెళ్లకపోవచ్చన్న భావన వ్యక్తం అవుతోంది. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా కమోడిటీ ధరల్లో అనిశ్చితినెలకొంది. అలాగే కరెన్సీ కదలికలు కూడా అథమంగా ఉన్నాయి. రూపాయి కనిష్టస్థాయికి పడిపోయింది. దీనివల్ల ప్రస్తుతపరిస్థితుల్లో పాలసీ రేట్లను మారిస్తే ద్రవ్యోల్బణం పెరుగుతుందని, అందువల్ల ఈ సమీక్షలో రెపోరేట్ల జోలికి వెళ్లకపోవచ్చని ఆర్థికవేత్తల అంచనాలున్నాయి. సుమారు 12 సంస్థలకు చెందిన ఆర్థికవేత్తలు ఇదే అభిప్రాయం వ్యక్తంచేసారు. ముడిచమురు దరల్లో అనిశ్చితి, భౌగోళిక ఉద్రిక్తతల కారణంగా ఆర్బీఐ ఏప్రిల్‌పాలసీలో రేట్లను పెంచకపోవచ్చని ఆర్బీఐ ద్రవ్యోల్బణ డేటాను పరిశీలించాకే నిర్ణయం తీసుకోవచ్చని ఇక్రా ప్రధాన ఆర్థికవేత్త అదితి నాయర్ అన్నారు.

ఎస్‌బిఐ చీఫ్ ఎకానమిస్ట్ సౌమ్యకాంతిఘోష్ మాట్లాడుతూ రెపోరేట్లను క్షుణ్ణంగాపరిశీలించిన తర్వాత ప్రస్తుత కమోడిటీ మార్కెట్ల స్థితిగతులను అంచనావేసిన తర్వాతనే ఆర్బీఐ రెపోరేట్లను యథాతథంగా కొనసాగించవచ్చన్నారు. డాలరుతో రూపాయి మారకం విలువలు 93స్థాయిని దాటింది. ముడిచమురు బ్యారెల్ 100 డాలర్లుగా కొనసాగాయి.అందువల్ల దిగుమతులపరంగాచూస్తే ద్రవ్యోల్బణం రాష్ట్రాలవారీగాపెరుగుతుందని ఘోష్ అంచనావేసారు. సూపర్ ఎల్‌నినో కూడా ప్రభావం పడుతుందన్నారు. క్రిసిల్ ఆర్థికవేత్తకూడా ఇదే అంచనాలనుప్రకటించారు. కేంద్రబ్యాంకు ఇప్పటివరకూ రెపోరేట్లను 1.25శాతం తగ్గించారు. ఆగస్టు, అక్టోబరు, ఫిబ్రవరి 2026లో కూడా పాలసీ రేట్లజోలికి వెళ్లలేదు. ఆరుగురుసభ్యులున్న ఎంపిసి కమిటీ ఏప్రిల్ పాలసీ సమీక్ష సోమవారంప్రారంభిస్తుంది. బ్యారెల్‌కు పది డాలర్లు చొప్పున పెరిగే అవకాశం ఉందని, ముడిచమురు ధరల్లో 0.60శాతం పెరుగుదల ఉంటుందని అంచనావేసారు. బ్యాంక్ ఆఫ్ బరోడా ఆర్థికవేత్త మదన్ సబ్నవిస్, హెచ్‌డిఎఫ్‌సి ప్రిన్సిపల్ ఆర్థికవేత్తసాక్షి గుప్తాలు కూడా ఇదే తరహా అభిప్రాయాలు వెల్లడించారు. ఆర్బీఐ ద్రవ్యోల్బణం గణాంకాలపై మళ్లీ అధ్యయనంచేయాల్సిన అవసరం ఉందని,

## జీఎస్టీ పరిధిలోకి పెట్రోలు డీజిల్

### చమురురంగ నిపుణులు కిరీట్ పరేఖ్ సూచన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: పశ్చిమాసియా యుద్ధం, హర్ముజ్‌జలసంధి మూసివేత వంటి వాటితో గల్ఫ్ దేశాలనుంచి చమురు,గ్యాస్ సరఫరాలో కొరత ఏర్పడటం వంటి వాటివల్ల అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరుగుతున్నాయి. ఈ ధరల భారం తగ్గించుకునేందు అత్యవసరంగా డీజిల్ పెట్రోలును జిఎస్టీపరిధిలోనికి తీసుకురావాల్సిన వసరం ఉందని ఆయిల్‌రంగ ఆర్థికనిపుణుడు కిరిట్ పారిఖ్ పేర్కొంటున్నాఉ. ప్లానింగ్‌కమిషన్ మాజీ సభ్యుడు అయిన పరేఖ్ విధాన నిర్ణేతలు అత్యసరంగా ఇంధన పనున వ్యవస్థను సమీక్షించుకోవాలని, ఆర్థికమంత్రి వెంటనే ఒక సమావేశం ఏర్పాటుచేయాలని, జిఎస్టీ కౌన్సిల్‌భేటీలోనే పెట్రోలు,డీజిల్ ఇతర పెట్రోలియం ఉత్పత్తులను జిఎస్టీపరిధిలో ఉంచేందుకు ఏకాభిప్రాయ సాధనచేయాలని సూచించారు. మద్యప్రాచ్యంలోని యుద్ధం పెట్రోడీజిల్‌ను జిఎస్టీ పరిధిలోకి తీసుకురావాల్సిన ఆవశ్యతను సూచిస్తోందన్నారు. ప్రస్తుతం బ్యారెల్‌కు 120.84 డాలర్లుగా ఉంది. ఫిబ్రవరి కంటే 75శాతంపెరిగాయి. ముడిచమురును 85శాతంవరకూ దిగుమతులే చేసుకుంటున్నది. 2025 ఆర్థికసంవత్సరంలో రాష్ట్రాలు వ్యాట్, సేల్స్‌ట్యాక్స్ వంటి వాటిద్వారా పెట్రోలియం ఉత్పత్తులనుంచి రూ.3 లక్షలకోట్లవరకూ రాబట్టుకునానయి.

ఢిల్లీలో వాట్ ఒక్కటే రూ.15.40 చొప్పున లీటరుకు వసూలయింది. రిటైల్‌ధరలో 16శాతం పన్నులే ఉన్నాయి. డీజిల్‌కు కూడా రూ.12.83లు వసూలయింది. అసలుధరలో 14శాతంగా ఉంది. పెట్రోలు, డీజిల్‌ను జిసిఎస్టీపరిధిలోనికి తసీఉకురావడంవల్ల రాష్ట్రాలన్నీ ఏకీకృత పన్ను విధానం అమలుచేయాల్సి ఉంటుంది. ధరల్లో అంతరాలను కూడా తగ్గించే అవకావం ఉందని, అలాగే కస్టమర్లపై మొత్తంగా పన్ను భారం ఉంటుందని అన్నారు. అంతర్జాతీయంగా ధరలు పెరిగినట్లయితే ఆయిల్‌మార్కెటింగ్‌కంపెనీలకు ద్రవ్యోల్బణ ముప్పు ఎదురవుతుందని, దీనివల్ల ధరలు పెంచడంతోపాటు వాటిపై అదనపు సుంకాలు ఉంటాయని,దీనివల్ల వినియోగదారులకు అదనపు భారం ఎదురవుతుందని కిరీట్‌పరేఖ్ అన్నారు.



## 6 కంపెనీల్లో 64వేల కోట్లు ఎంక్యాప్ లాస్




**ముంబయి, ఏప్రిల్ 5:** ఈక్విటీ మార్కెట్లలోని టాప్ పది కంపెనీల్లో ఆరు కంపెనీల మార్కెట్ విలువలు రూ.64,734.46కోట్లు దిగజారాయి. భారతి ఎయిర్‌టెల్ ఈసారి ఎక్కువ నష్టపోయింది. భారతి ఎయిర్‌టెల్ మార్కెట్ విలువలు రూ.29,993.07 కోట్లు క్షీణించి రూ.10,20,420.26 కోట్లకు చేరింది. ఐసిఐసిఐబ్యాంకు విలువలుక ఊడా రూ.12,845.81 కోట్లు క్షీణించి రూ.8,70,705.49 కోట్లకు చేరాయి. బజాజ్‌ఫైనాన్స్ కూడా రూ.11,169.36 కోట్లు క్షీణించి రూ.5,14,226.12 కోట్లకు చేరింది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకుమార్కెట్ విలువలుకూడా రూ.7822.79 కోట్లు క్షీణించి రూ.11,56,195.90 కోట్లకు చేరింది. హిందూస్థాన్ యూనిలీవర్ ఎంకాప్‌కూడా రూ.2349.59 కోట్లు తగ్గింది రూ.4,85,190.60 కోట్లకు చేరింది. భారతీయ స్టేట్‌బ్యాంకు మార్కెట్ విలువలు రూ.553.84 కోట్లు క్షీణించి రూ.9,41,015.31 కోట్లకు చేరింది. ఇక టిసిఎస్ విలువలు మాత్రం రూ.22,359.78 కోట్లు పెరిగి రూ.8,87,028.43 కోట్లకు చేరింది. ఇన్ఫోసిస్ ఎంక్యాప్‌కూడా రూ.12,374.76 కోట్లుపెరిగి రూ.5,27,409.43 కోట్లకు చేరింది. ఎల్‌అండ్‌టి విలువలు కూడా రూ.4575.43 కోట్లుపెరిగి రూ.4,97,111.62కోట్లకు చేరింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.3518.45 కోట్లు క్షీణించి రూ.18,28,034.07 కోట్లకు చేరింది. మొత్తం టాప్ పదిసంస్థల్లో రిలయన్స్ నంబర్‌వన్‌స్థానంలో ఉంటే తర్వాతస్థానాల్లో వరుసగా హెచ్‌డిఎఫ్‌సి, భారతి ఎయిర్‌టెల్; ఎస్‌బిఐ, టిసిఎస్, ఐసిఐసిఐ బ్యాంకు, ఇన్ఫోసిస్, బజాజ్‌ఫైనాన్స్,ఎల్‌అండ్‌టి, హిందూస్థాన్ యూనిలీవర్‌లు నిలిచాయి.

## హీరాబాయ్ ట్రస్టు నుంచి వైదొలిగిన శ్రీనివాసన్

**ముంబయి, ఏప్రిల్ 5:** టాటాట్రస్టుల్లో ఉన్న అధికారపోరు తారస్థాయికి చేరింది. తాజాగా ట్రస్టులో సీనియర్ వైస్‌ఛైర్మన్, టాటాసన్స్ బోర్డు డైరెక్టర్‌గా కొనసాగుతున్న వేణుశ్రీనివాసన్ రాజీనామాచేసారు. హీరాబాయ్ టాటాట్రస్టునుంచి వైదొలగారు. మాజీ ట్రస్టీ మెహ్లీ మిస్త్రీ ఛారిటీ కమిషనర్‌వద్ద శ్రీనివాసన్, మరో వైస్‌ఛైర్మన్ విజయ్‌సింగ్‌ను భాయ్ హీరాబాయ్ జెషెడ్జీ టాటా నవ్‌సారిఛారిటబుల్ ఇన్‌స్టిట్యూట్‌నుంచి తొలగించాలని ఫిర్యాదులు చేసారు. పార్సీయేతరులకు వారి ట్రస్టుల్లో కొనసాగే అర్హత లేదని ఆయన తన పిటిషన్‌లో వాదించారు. పిటిషన్‌కు అంతగా పసలేకపోయినా ఇపుడు టాటాట్రస్టుల్లోని ఒక డజనుకు పైగా సంస్థలను ప్రభావితంచేస్తుందని అంచనా. గత అక్టోబరులో తనను ట్రస్టులనుంచి తొలగించడాన్ని కూడా ఆయన సవాల్‌చేసారు. శ్రీనివాసన్, ఇంగ్‌లు వేసిన ఓట్లు చెల్లనివి ఆని వాటిని చెల్లుబాటు కానవిగా పరిగణించాలని ఆయన కోరారు. మిస్త్రీ అంతకుముందు ఛారిటీ కమిషనర్‌కు ఫిర్యాదుచేసి తర్వాత వారంరోజుల్లోనే ఉపసంహరించుకుని రాజీనామాచేసారు. టివిఎస్‌మోటార్ ఛైర్మన్ ఎమిరటస్‌గా ఉన్న వేణుశ్రీనివాసన్ టాటాట్రస్టుల్లో ఎక్కువ ట్రస్టులకు వైస్‌ఛైర్మన్‌గా ఉన్నారు. తనకు ఇతరత్రా వ్యాపకాలు పెరిగినందున ఈ పదవుల నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు.



## లక్షకోట్లు టర్నోవర్ దాటిన అమూల్



### గ్లోబల్ బ్రాండ్‌గా గుజరాత్ సంస్థ రికార్డు

**అహ్మదాబాద్, ఏప్రిల్ 5:** గుజరాత్ సహకార పాల మార్కెటింగ్ మాఖ్య ఆధ్వర్యంలో కొనసాగుతున్న అమూల్‌బ్రాండ్ టర్నోవర్ లక్షకోట్లు దాటిందని కంపెనీ వెల్లడించింది. తొలిసారిగా టర్నోవర్ లక్షకోట్లు అధిగమించిందని, విస్తృత స్థాయిలో ఉన్న ఉత్పత్తుల పోర్టుఫోలియోలే ఇందుకు కారణమని కంపెనీ పేర్కొంది. యూరోప్, అమెరికాల్లోకూడా తమకు భారీ వృద్ధి ఉందని తెలిపారు. జిసిఎంఎంఎఫ్ సొంత టర్నోవర్ రూ.73,450 కోట్లు దాటిందని అన్నారు. అంతకుముందు ఏడాదిలో ఉన్న రూ.90 వేల కోట్లు టర్నోవర్ ప్రస్తుతంరూ.లక్షల కోట్లు దాటిందని అన్నారు. మొత్తం 3.6 మిలియన్లమంది డైయిరీ రైతులు సంస్థపరిధిలోపనిచేస్తున్నట్లు తెలిపారు. విదేశీ మార్కెట్లలోకి ప్రవేశించామని, యూరోప్, అమెరికా మార్కెట్లు తమ వృద్ధికి మరింత బాటలువేసినట్లు కంపెనీ ప్రకటించింది. ఇపుడుప్రపంచ వ్యాప్తంగా కుటుంబాల్లో అమూల్ ఒక బ్రాండ్‌గా విస్తరించిందని ప్రకటించింది.

బ్రాండ్ టర్నోవర్‌లో 11శాతం వృద్ధినమోదుచేసినట్లు ఎఫ్ఎంసిజి సంస్థగా భారత్‌లో అతిపెద్ద బ్రాండ్‌గా నిలిచిందని కంపెనీ పేర్కొంది. అందుబాటులోకి వచ్చిన సాంకేతికతను వినియోగించుకుంటూ ప్రాసెసింగ్ సామర్థ్యం కూడా పెంచు తున్నట్లు కంపెనీ వివరించింది. రైతుల సంక్షేమం, పాల సరఫరాలో వారికి గిట్టుబాటయ్యే ధరలను అందించడంవల్లనే నేడు అమూల్ గ్లోబల్ బ్రాండ్‌గా అవతరించగలిగిందని కంపెనీ విశ్లేషించింది. సాలీనా 50 దేశాల్లో 2400 కోట్ల ప్యాకెట్లను పంపిణీచేస్తున్నట్లు తెలిపింది. 3.6 మిలియన్ల రైతులనుంచి 31 మిలియన్ల పాలను నిత్యం సేకరిస్తున్నట్లుతెలిపింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.